


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 25.08.2025 | సంపుటి : 2 | సంచిక :203 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Monday | 25.08.2025 | volume : 2 | Issue : 203 | Pages : 8 | Cost : 2/-



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575






# సురవరానికి తుది వీడ్కోలు

**రేవంత్, చంద్రబాబు, వెంకయ్య సహా ప్రముఖుల నివాళి**

**అధికార లాంఛనాలతో అంతిమ యాత్ర**

**గాంధీ వైద్య కళాశాలకు భౌతిక కాయం అప్పగింత**

హైదరాబాద్, ఆగస్టు 24 :
అనారోగ్యంతో కన్నుమూసిన కమ్యూనిస్టు దిగ్గజం, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డికి కుటుంబసభ్యులు, వివిధ పార్టీల నేతలు, సీపీఐ కార్యకర్తలు ఆదివారం అంతిమ వీడ్కోలు పలికారు. తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు.. తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ మగ్దూంభవన్‌లో సురవరం పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. సీపీఎం, సీపీఐ ప్రధాన కార్యదర్శులు ఎంఏ బేబీ, డి.రాజా, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు తదితర ప్రముఖులు సురవరం భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే సంతాప సందేశాన్ని పంపారు. సురవరం కోరిక మేరకు ఆయన భార్య విజయలక్ష్మి, కుమారులు కపిల్, నిఖిల్‌లు పార్థివ దేహాన్ని వైద్యవిద్య బోధన నిమిత్తం గాంధీ మెడికల్ కళాశాలకు అప్పగించారు. సురవరం భౌతికకాయాన్ని ఎంబామింగ్(రసాయనాల పూత) చేసి భద్రపరుస్తామని... వైద్య విద్యార్థుల పరిశోధనలు, శరీర నిర్మాణం, శాస్త్రీయపరమైన విజ్ఞానాన్ని పెంపొందించడానికి ఉపయోగిస్తామని గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఇందిర తెలిపారు.



02

# సినిమా పరిశ్రమకు పూర్తి సహకారం

- వివాదం ఉండొద్దనే సమ్మె విరమణకు చొరవ చూపాను
- అందరూ చట్టం పరిధిలో పనిచేయాల్సిందే
- నిర్మాతలు, దర్శకులతో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 24 :
ప్రభుత్వం నుంచి సినిమా పరిశ్రమకు పూర్తి సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సినిమా పరిశ్రమలో పని వాతావరణం బాగుండాలని కోరారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆదివారం రేవంత్‌రెడ్డిని పలువురు తెలుగు సినీ నిర్మాతలు, దర్శకులు కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. "పరిశ్రమలోకి కొత్తగా వచ్చేవారి నైపుణ్యాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. స్కిల్స్ యూనివర్సిటీలో సినిమా పరిశ్రమ కోసం కావాల్సిన ఏర్పాట్లు చేస్తాం. తెలుగు సినిమా రంగం అంతర్జాతీయ స్థాయికి వెళ్లింది. రాష్ట్రంలో ముఖ్యమైన పరిశ్రమగా మారింది. పరిశ్రమలో వివాదం ఉండకూడదని కార్మికుల సమ్మె విరమణకు చొరవ చూపించాను. నిర్మాతలు, కార్మికుల అంశంలో సంస్కరణలు అవసరం. కార్మికుల విషయంలో నిర్మాతలు మానవత్వంతో వ్యవహరించాలి. కార్మికులను కూడా పిలిచి మాట్లాడతాను. నిర్మాతలు, కార్మికులు, ప్రభుత్వం కలిసి ఒక విధానం తీసుకొస్తే బాగుంటుంది. కార్మికులను, నిర్మాతలను మా ప్రభుత్వం కాపాడుకుంటుంది.



02

## సుప్రీం తీర్పుతో ఫిరాయింపుదారుల్లో భయం : కేటీఆర్



02

## ఓటమి భయంతోనే స్థానిక ఎన్నికలు వాయిదా

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

# కేంద్రం నిర్లక్ష్యం వల్లే యూరియా కొరత

**11 ఏళ్లుగా లేని యూరియా కొరత.. ఇప్పుడెందుకు వచ్చిందో తెలియదా?**

- మీ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు
- కిషన్‌రెడ్డిపై మంత్రి తుమ్మల ధ్వజం



హైదరాబాద్, ఆగస్టు 24 :
యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకే కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. వాస్తవాలు దాచి.. యూరియా దారి మళ్లిందని చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంత్రి ఆదివారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 'యూరియా డిమాండ్‌కు అనుగుణంగా దిగుమతి జరగడం లేదని కిషన్‌రెడ్డి అంగీకరిస్తూనే.. సరకు దారి మళ్లుతోందని బుకాయిస్తున్నారు. యూరియా కొరతపై మంత్రులు పదే పదే చెప్పడం వల్లే రైతులు ముందే కొనుక్కునే ప్రయత్నం చేస్తున్నారన్న వ్యాఖ్యలు ఆయన స్థాయికి తగవు. గత ఏడాదిన్నర కాలంలో యూరియా కోసం ఇంతటి సమస్య లేదు. ఈసారి కేంద్రం కేటాయింపుల మేరకు రాష్ట్రానికి ఇవ్వకపోవడం ఇబ్బందికరంగా మారింది. ప్రజలకు ఈ నిజాలు చెప్పి కేంద్ర మంత్రిగా యూరియాను సరఫరా చేయించడం ఆయన బాధ్యత' అని తుమ్మల తెలిపారు.

## మరోసారి మాదే అధికారం

- కులం, మతం అనకుంటే బండి సంజయ్ గెలిచేవారా!
- జనహిత యాత్రలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



కరీంనగర్, ఆగస్టు 24 :
వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 స్థానాల్లో విజయం సాధించి రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరుతుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. రెండో విడత జనహిత పాదయాత్రను ఆదివారం సాయంత్రం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఉప్పరమల్యాలలో ప్రారంభించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ ముఖ్య అతిథిగా హాజరైన యాత్రకు కార్యకర్తలు ఉత్సాహంగా తరలివచ్చారు. రాత్రి గంగాధరలో నిర్వహించిన కూడలి సమావేశంలో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. 'రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి పని అయిపోయింది. భాజపా అక్కడక్కడ పచ్చగడ్డిలా ఉంది. మేం దేవుడి పేరిట ఓట్లు అడగలేదు. అభివృద్ధి చేసి ఓట్లు అడిగే దమ్మున్న పార్టీ మాది.

మిగతా 2 లో



## నేడు ఢిల్లీలో న్యాయకోవిదులతో సీఎం భేటీ

- 'స్థానికం'లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల కల్పనకు అనుసరించాల్సిన విధానంపై చర్చ
- పాల్గొననున్న భట్టి, ఉత్తమ్
- మంత్రుల కమిటీ సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 24 :
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి అనుసరించాల్సిన విధానంపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీలో ప్రముఖ న్యాయ కోవిదులతో భేటీ కానున్నారు. ఇందుకోసం సీఎంతోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం దేశరాజధానికి వెళ్లనున్నారు. న్యాయకోవిదులతో చర్చించి వారి అభిప్రాయాలను సేకరించాలని ఈ అంశంపై ఏర్పాటైన రాష్ట్ర మంత్రుల కమిటీ నిర్ణయించింది. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కమిటీ సమావేశమై అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డితో చర్చించింది. కమిటీ సభ్యులైన మంత్రులు ఉత్తమ్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. మరో సభ్యుడైన మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్‌లో తన అభిప్రాయాన్ని తెలియజేశారు. న్యాయపరమైన అవరోధాలు లేకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఎలా ముందుకెళ్లాలని మంత్రుల కమిటీ చర్చించింది. రాష్ట్రంలో కులగణన చేపట్టి.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు శాసనసభలో బిల్లును ఆమోదించి గవర్నర్‌కు పంపామని భట్టి వివరించారు.

మిగతా 2 లో

# సినిమా పరిశ్రమకు పూర్తి సహకారం

(మొదటిపేజీ తరువాయి)

సినిమా పరిశ్రమకు పర్యవేక్షణ అవసరం. ఈ రంగానికి ఏమేం కావాలో కొత్త పుస్తకం రాసుకుందాం. వ్యవస్థలను నియంత్రిస్తామంటే ప్రభుత్వం సహించదు. అందరూ చట్టం పరిధిలో పనిచేయాల్సిందే. పరిశ్రమ విషయంలో న్యూట్రల్‌గా ఉంటాను. హైదరాబాద్‌లో అంతర్జాతీయ సినిమాల చిత్రీకరణ కూడా జరుగుతోంది. తెలుగు సినిమాల చిత్రీకరణ ఎక్కువగా రాష్ట్రంలోనే జరిగేలా చూడాలి. అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సినిమా పరిశ్రమను ఉంచడమే నా ధ్యేయం" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, నిర్మాతలు అల్లు అరవింద్, సురేశ్‌బాబు, జెమిని కిరణ్, స్రవంతి రవికిశోర్, నవీన్ ఎర్నేని, వంశీ, బాపినీడు, డీవీవీ దానయ్య, చెరుకూరి సుధాకర్, సాహు, అభిషేక్, విశ్వప్రసాద్, అనిల్, శరత్, ఎన్వీ ప్రసాద్, ఎస్‌కేఎన్, రాధామోహన్, దాము, దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్, బోయపాటి శ్రీను, సందీప్‌రెడ్డి, వంశీ పైడిపల్లి, అనిల్ రావిపూడి, వెంకీ పాల్గొన్నారు.

# నేడు ఢిల్లీలో న్యాయకోవిదులతో సీఎం భేటీ

(మొదటిపేజీ తరువాయి)

అది గవర్నర్ నుంచి రాష్ట్రపతి వద్దకు వెళ్లిందని.. అక్కడ 5 నెలలుగా పెండింగ్‌లో ఉందన్నారు. మరోవైపు సెప్టెంబరు 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో న్యాయపరమైన వివాదాలు ఏర్పడకుండా రిజర్వేషన్ కల్పించాలంటే ఏం చేయాలో సలహా ఇవ్వాలని అడ్వొకేట్ జనరల్ అభిప్రాయం కోరారు. ఇతర రాష్ట్రాల్లో గతంలో రిజర్వేషన్ల పెంపునకు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే కోణంలో ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిసింది. ఈ విషయంలో ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీచేస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తదితరుల అభిప్రాయాన్ని తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది.

### గవర్నర్‌లకు గడువుపై రాష్ట్రం తరఫున వాదనలు..

మరోవైపు బిల్లుల ఆమోదంలో రాష్ట్రపతి, గవర్నర్‌లకు నిర్దిష్ట గడువు ఉండేలా చూడాలని సుప్రీంకోర్టులో ఇప్పటికే కేసు విచారణలో ఉంది. ఆ కేసులో తెలంగాణ తరఫున బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం గురించి ప్రస్తావించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రం తరఫున వాదనలు వినిపించేందుకు న్యాయవాదులను నియమించాలని యోచిస్తోంది. ఈ విషయంపైనా సోమవారం దిల్లీలో న్యాయకోవిదులతో రేవంత్‌రెడ్డి, భట్టి, ఉత్తమ్ చర్చించనున్నారు. రిజర్వేషన్ల అంశంపై ఎలా ముందుకెళ్లాలనేది తేలిన తర్వాత ఈ నెల 29న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి ప్రభుత్వం అధికారికంగా నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. ఈలోగా కాంగ్రెస్ సీనియర్ నేతల కమిటీ కూడా అధ్యయనం చేసి నివేదిక ఇస్తుందని పీసీసీ వర్గాలు తెలిపాయి. అధికారికంగా రిజర్వేషన్ల అమలుకు గట్టి చర్యలు తీసుకునే ఉద్దేశంతోనే మంత్రుల, కాంగ్రెస్ నేతల కమిటీలు అధ్యయనం చేస్తున్నట్లు పార్టీ వర్గాలు వివరించాయి.



# మరోసారి మాదే అధికారం

(మొదటిపేజీ తరువాయి)

గెలిచిందని రాహుల్‌గాంధీ ఆధారాలతో చూపించారు. రాష్ట్రంలోనూ ఆ పార్టీకి చెందిన 8 మంది ఎంపీలు ఇలాగే గెలిచి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భారత రాష్ట్ర సమితిలో మూడు ముక్కలాట ముగిసింది. ఇదే అదనుగా నాలుగో ముక్కగా ఒక నేత అవకాశం కోసం చూస్తున్నారు' అంటూ మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. 'సామాజిక న్యాయమే మా ప్రభుత్వ ధ్యేయం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీ బిహార్‌లో యాత్ర చేపడుతున్నారు. ప్రజల కష్ట సుఖాలను, ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకునేందుకే మేం ఈ యాత్ర నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారు' అని అన్నారు. అంతకుముందు నేతలంతా కలిసి దాదాపు 6 కి.మీ మేర పాదయాత్ర చేశారు. కురిక్యాలలో పలువురు మహిళలను పార్టీ నేతలు పలకరించారు. ప్రభుత్వ పథకాల అమలుపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. యాత్రలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, వివేక్ వెంకట్‌స్వామి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, మక్కాన్‌సింగ్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, పార్టీ నాయకులు వి.హన్మంతరావు, జీవన్‌రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు, అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీలకు పది పైసలైనా ఇచ్చారా?

### మాజీ మంత్రి హరీశ్‌రావు



**జగదేవపూర్ :** సీఎం రేవంత్‌రెడ్డి పాలన గాడి తప్పిందని, పల్లెలు పట్టణాలు తేడా లేకుండా పారిశుద్ధ్యం పడకేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిమ్మాపూర్‌లో ఇటీవల ఇద్దరు డెంగీ లక్షణాలతో మృతిచెందిన విషయం తెలుసుకున్న హరీశ్‌రావు ఆదివారం ఆ గ్రామాన్ని సందర్శించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆ యువకులది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. ఒక్క తిమ్మాపూర్‌లోనే 50 కుటుంబాలు ప్రైవేటు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ అప్పుల పాలవుతున్నాయన్నారు. "గ్రామపంచాయతీ వర్కర్లకు జీతాలు రావడం లేదు. దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ కొనడానికైనా డబ్బులు లేని పరిస్థితి. ఎక్కడైనా సీఎం పర్యటించారా? కనీసం పారిశుద్ధ్యంపై సమీక్ష నిర్వహించారా? ప్రభుత్వం వెంటనే మేల్కొని గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయాలి. కేసీఆర్ హయాంలో నెలకు రూ.300 కోట్లు గ్రామపంచాయతీలకు ఇచ్చేవారు. రేవంత్‌రెడ్డి కనీసం పది పైసలైనా ఇచ్చారా? అటు మనుషులకు సోకుతున్న వ్యాధులకు, ఇటు పంటలకు మందులు లేకున్నా గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. ఇది చాలదన్నట్టు గ్రామస్థాయిలోనూ మద్యం దుకాణాలు తెరిచేందుకు ప్రభుత్వం యోచిస్తుండటం హాస్యాస్పదం. ముఖ్యమంత్రి ప్రతిపక్షాలపై కేసులు వేయడానికి ఎత్తుగడలు వేస్తున్నారు" అని పేర్కొన్నారు. అటవీ అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సురవరానికి తుది వీడ్కోలు

- ప్రజల సందర్శనార్థం సీపీఐ ఆఫీసులో భౌతిక కాయం
- రేవంత్, చంద్రబాబు, వెంకయ్య సహా ప్రముఖుల నివాళి
- అధికార లాంఛనాలతో అంతిమ యాత్ర
- గాంధీ వైద్య కళాశాలకు భౌతిక కాయం అప్పగింత



**హైదరాబాద్:** సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డికి ప్రభుత్వం అధికార లాంఛనాలతో తుది వీడ్కోలు పలికింది. గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రి నుంచి ఉదయం 10 గంటలకు హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌కు ఆయన భౌతిక కాయాన్ని తీసుకువచ్చారు. అక్కడ ప్రజలు, కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు. రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు. మధ్యాహ్నం 3 గంటలకు సురవరం భౌతిక కాయానికి పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం సుధాకర్‌రెడ్డి భౌతిక కాయాన్ని గాంధీ వైద్య కళాశాలకు అప్పగించేందుకు అంతిమ యాత్ర మొదలైంది. ఇందులో భాగంగా హిమాయత్‌నగర్ వై జంక్షన్ వరకు పోలీసుల మార్చ్ సాగింది. అక్కడి నుంచి రెడ్ వాలంటీర్లు కవాతు చేశారు. నారాయణగూడ చౌరస్తా, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, ముషీరాబాద్ మీదుగా యాత్ర సాగింది. సాయంత్రం 4.45 గంటలకు సురవరం భౌతిక కాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఈ సందర్భంగా విప్లవ జోహార్లు అంటూ కార్యకర్తలు పాటలు పాడుతూ సుధాకర్‌రెడ్డికి కడసారి వీడ్కోలు పలికారు.

### రేవంత్, చంద్రబాబు నివాళి..

సీపీఐ దిగ్గజ నేత సురవరం సుధాకర్ రెడ్డి పేరును శాశ్వతంగా గుర్తుండేలా చేస్తామని, ఈ మేరకు క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలకు ఆదర్శంగా నిలిచిన వారిని తమ ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. మఖ్దూం భవన్‌లో సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి రేవంత్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును హార్టికల్చర్ యూనివర్సిటీకి, జైపాల్‌రెడ్డి పేరును పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నామకరణం చేసి వారిని గౌరవించుకున్నామని, అదే కోవలో సుధాకర్‌రెడ్డి పేరు కూడా శాశ్వతంగా నిలిచిపోయేలా చేస్తామని తెలిపారు. సుధాకర్‌రెడ్డి లాంటి గొప్ప నాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. చిన్న నాటి నుంచి ప్రజల పక్షాన నిలబడి.. ప్రజల కోసం పోరాడారని కొనియాడారు. సురవరం మృతి సీపీఐకి, దేశానికి తీరని లోటని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి చంద్రబాబు అంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సురవరంతో తనకు సుదీర్ఘ స్నేహం ఉందని చంద్రబాబు తెలిపారు. ఆయనకు అనేక ఉద్యమాలు నడిపిన అనుభవం ఉందని అన్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సురవరం భౌతిక కాయానికి నివాళులు అర్పించి, సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, జానారెడ్డి, కోదండరాం తదితరులు సురవరం భౌతిక కాయానికి నివాళులర్పించారు.

### సురవరం మద్దతు మరువలేనిది : కేటీఆర్

తెలంగాణ ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించి చిరస్మరణీయ ముద్ర వేసుకున్న సురవరం సుధాకర్‌రెడ్డి మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సురవరం భౌతిక కాయానికి ఆది వారం ఆయన నివాళులు అర్పించారు. సురవరంతో ఉన్న అనుభవాలను కేసీఆర్ గుర్తుచేసుకున్నారని, కేసీఆర్ తరఫున సుధాకర్ రెడ్డికి నివాళులర్పిస్తున్నామని చెప్పారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, పలువురు బీఆర్‌ఎస్ నేతలు సుధాకర్‌రెడ్డికి నివాళులర్పించారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు కె.శ్రీనివాస్, అల్లం నారాయణ, ఘంటా చక్రపాణి, జయప్రకాష్ నారాయణ, మాజీ సీజేఐ ఎన్వీ రమణ తదితరులు సుధాకర్‌రెడ్డికి నివాళులు అర్పించారు.



# ఓటమి భయంతోనే స్థానిక ఎన్నికలు వాయిదా

### భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

**హైదరాబాద్ :** ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భాజపా మీడియా, ఐటీ, సామాజిక మాధ్యమాల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసి 19 నెలలైనా ఎందుకు ఎన్నికలు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. "రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇస్తున్న నిధులను సరిగా వినియోగించకుండా దారి మళ్లిస్తోంది. భారత రాష్ట్ర సమితి హయాంలో పలువురు సర్పంచులు చేసిన పనులకు బిల్లులు రాక, అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్నారు" అని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సిద్ధాంతాలు, కేంద్రం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. భాజపా విజయానికి సామాజిక మాధ్యమాల విభాగం కీలకంగా పనిచేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా అంశంలో కావాలనే కృత్రిమ కొరత సృష్టించి మోదీ ప్రభుత్వాన్ని చెడుగా చూపించే ప్రయత్నం చేసిందని ఆరోపించారు.

### రిజర్వేషన్ల హామీ నిలబెట్టుకోని కాంగ్రెస్

భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ దేశమంతా ప్రస్తుతం తెలంగాణ వైపు చూస్తోందని, రాష్ట్రంలో భాజపా రోజురోజుకూ బలపడుతోందన్నారు. కాంగ్రెస్‌కు భాజపానే ప్రత్యామ్నాయం అవుతుందనే సంకేతాలు స్పష్టంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో భాజపాకు ఓటువేసేలా ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. భాజపా సామాజిక మాధ్యమాల జాతీయ కన్వీనర్ ప్రేమ్‌శుక్లా మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పేరుతో భాజపాపై నిందలు వేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కాసం వెంకటేశ్వర్లు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, పార్టీ నేతలు సుభాష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ

**హైదరాబాద్:** అసెంబ్లీ స్పీకర్ జారీ చేసిన నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు 10 మంది ఎమ్మెల్యేలు సన్నద్ధమవుతున్నారు. భారత రాష్ట్ర సమితికు చెందిన 10 మంది శాసన సభ్యులు కాంగ్రెస్‌లో చేరారని, ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని దాఖలైన కేసులో మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని గత నెల 25న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో న్యాయనిపుణులు, అడ్వొకేట్ జనరల్‌తో చర్చించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్.. 10 మంది ఎమ్మెల్యేలకు ఇటీవలే నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసులపై సంతకాలు చేసిన అనంతరం దిల్లీలో ఏర్పాటు చేసిన 'అఖిల భారత స్పీకర్ల సదస్సు'లో పాల్గొనడానికి వెళ్లారు. శాసన సభాపతి కార్యాలయం నుంచి జారీ అయిన నోటీసులు ఇప్పటికే ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరెకపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, తెల్లం వెంకట్రావులకు అందినట్లు తెలిసింది. వీరిలో కొందరు నేరుగా స్వీకరించగా.. మరికొందరికి వారి కార్యాలయాల్లో అందజేసినట్లు సమాచారం. కాలే యాదయ్య, డాక్టర్ సంజయ్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, దానం నాగేందర్‌లకు సోమ, మంగళవారాల్లో నోటీసులు అందించేందుకు స్పీకర్ కార్యాలయం ఏర్పాట్లు చేసింది. జిల్లాల్లో ఉన్న బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, తెల్లం వెంకట్రావ్ తదితరులు సోమవారం హైదరాబాద్‌కు చేరుకొని.. తమ కార్యాలయాల్లో ఇచ్చిన నోటీసులను స్వీకరించనున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేలపై వచ్చిన ఆరోపణలపై నోటీసుల్లో వివరణ కోరినట్లు సమాచారం.

### దిల్లీ నుంచి వచ్చాక స్పీకర్‌తో భేటీ!

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో స్పీకర్ నుంచి ఏదో ఒక రోజు నోటీసులు అందుతాయని ముందే ఊహించిన కొందరు ఎమ్మెల్యేలు.. ఇప్పటికే న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపారు. కొందరు దిల్లీలో సుప్రీంకోర్టు న్యాయవాదులను సంప్రదించారు. న్యాయకోవిదుల సూచనల మేరకు సభాపతికి సమాధానం ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు. కాగా, తాము పార్టీ మారలేదని, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నామని, నియోజకవర్గ అభివృద్ధి పనుల్లో భాగంగా సీఎంని మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా తమను ఆయన సత్కరించారు తప్ప.. కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని పలు సందర్భాల్లో కొందరు ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. దిల్లీలో సదస్సు అనంతరం స్పీకర్ మంగళవారం హైదరాబాద్‌కు చేరుకోనుండటంతో... ఆ తరువాత ఆయనను నోటీసులు అందుకున్న ఎమ్మెల్యేలు కలిసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# సుప్రీంకోర్టు తీర్పుతో ఫిరాయింపుదారుల్లో భయం : కేటీఆర్



**హైదరాబాద్:** ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో భయం మొదలైందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. 'పార్టీ మారిన ఎమ్మెల్యేలు దమ్ముంటే రాజీనామా చేసి ఉప ఎన్నికలో గెలవాలి' అని ఆయన సవాల్ విసిరారు. మియాపూర్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హైడ్రా అరాచకాలతో హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుదేలైందని విమర్శించారు. కనికరం లేకుండా పేదల ఇళ్లు కూల్చివేసిన హైడ్రా, దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన ముఖ్యమంత్రి సోదరుడి ఇంటిని ఎందుకు కూల్చలేదని ప్రశ్నించారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ నాయకులు అరాచకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బిల్డర్ల నుంచి ఆర్ఆర్ ట్యాక్స్ పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని సాక్షాత్తు ప్రధానమంత్రే పేర్కొన్నట్లు తెలిపారు. గడిచిన 20 నెలల్లో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు వ్యక్తిగత ప్రయోజనాల కోసమే కాంగ్రెస్‌లో చేరారన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బీమా పాలసీ డబ్బులు చెల్లించాలని ఫోరం తీర్పు

**కరీంనగర్ :** వినియోగదారులకు సేవలందించడంలో లోపం ఉండటంతో బీమా పాలసీ డబ్బులు వడ్డీతో సహా చెల్లించాలని కరీంనగర్ జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యులు ఎస్.శ్రీలత, సీహెచ్.వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కరీంనగర్‌కు చెందిన ఫిర్యాదుదారు చిలువేరు ప్రభాకర్ కథనం మేరకు..ప్రభాకర్ భార్య దేవకి దేవి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు. కలెక్టరేట్ సమీపంలోని ఎస్బీహెచ్ నుంచి గృహ రుణం తీసుకున్నారు. 2006 డిసెంబరు 11న రూ.10 లక్షలకు 14 ఏళ్లపాటు ప్రతి నెల రూ.660 ప్రీమియం చెల్లించేలా అదే బ్యాంకు బీమా పాలసీ తీసుకున్నారు. ప్రతి నెల ఆమె ఖాతా నుంచి ఇంటి రుణానికి, బీమా పాలసీకి డబ్బులు జమ అయ్యేవి. 2020 నవంబరులో దేవకి దేవి మరణించారు. ఆమె భర్త ప్రభాకర్ 2021 జనవరి 25న బీమా సంస్థను పాలసీ డబ్బుల గురించి సంప్రదించారు. 2017 ఫిబ్రవరి 11 నుంచి ప్రీమియం డబ్బులు చెల్లించకపోవడంతో పాలసీ రద్దు అయిందని వారు తెలిపారు. దీంతో ప్రభాకర్ న్యాయవాది ద్వారా జిల్లా వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. బ్యాంకు, బీమా కంపెనీ అధికారులు ఫోరం ముందు హాజరై.. ప్రీమియం డబ్బులు చెల్లించకపోవడంతో పాలసీ రద్దయిందని తెలిపారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన ఫోరం సభ్యులు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, అదే బ్యాంకు బీమా సంస్థ అధికారుల సేవల్లో లోపం ఉందంటూ..9 శాతం వడ్డీతో పాలసీ సొమ్ము రూ.10 లక్షలు, ఫిర్యాదు ఖర్చుల కింద రూ.5 వేలు ఫిర్యాదుదారుకు చెల్లించాలని తీర్పు చెప్పారు.

# ఉక్రెయిన్‌కు మరో 3,350 క్షిపణులు పంపనున్న అమెరికా



**వాషింగ్టన్:** ఉక్రెయిన్ గగనతల రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మరో 3,350లకు పైగా ఎక్స్‌టెండెడ్ రేంజ్ అటాక్ మ్యూనిషన్ క్షిపణులను ఆ దేశానికి అందించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఆయుధ ప్యాకేజీకి యూరోపియన్ దేశాలు నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపాయి. దాదాపు ఆరు వారాల్లో ఈ క్షిపణులు కీవ్‌కు చేరుకుంటాయని సమాచారం. అయితే 240 నుంచి 450 కి.మీ పరిధి కలిగిన ఈఆర్ఏఎమ్ క్షిపణులను రష్యాపైకి ప్రయోగించాలంటే ఉక్రెయిన్ పెంటగాన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అమెరికా అధికారులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలను సరఫరా చేసే విషయాన్ని అమెరికా ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. మరోవైపు రష్యా భూభాగంలోని లక్ష్యాలను ఛేదించడానికి అమెరికా రూపొందించిన లాంగ్-రేంజ్ ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్స్‌ను వినియోగించకుండా పెంటగాన్ అడ్డుకుంటున్నట్లు పలు నివేదికలు సూచిస్తున్నాయి. మాస్కో చేపడుతున్న దాడులకు దీటుగా ఆయుధాలను ఉపయోగించకుండా కీవ్ సామర్థ్యాన్ని పరిమితం చేస్తోందని పేర్కొన్నాయి. యుద్ధం ముగింపునకు తాను ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఇరుదేశాల నేతలు ముందడుగు వేస్తుండకపోవడంతో ట్రంప్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీవ్‌కు సహాయంగా అగ్రరాజ్యం పలుమార్లు పెద్ద మొత్తంలో ఆయుధ సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌కు 32.2 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు, అత్యాధునిక క్షిపణులు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ఇటీవల ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని అమెరికా చట్టసభకు తెలియజేశామని విదేశాంగ శాఖ తెలిపింది. ఇందులో 15 కోట్ల డాలర్లు అమెరికా ఇప్పటికే అమ్మిన ఆర్మర్డ్ వాహనాల నిర్వహణకు, 17.2 కోట్ల డాలర్లు ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణి వ్యవస్థల కొనుగోలుకు వినియోగిస్తారు. ఉక్రెయిన్ దారుణమైన దాడులకు గురవుతున్న కారణంగా కీవ్‌కు మరిన్ని ఆయుధాలు పంపుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో మరోసారి క్షిపణులను అందజేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి.



## చట్టసభలు.. ప్రజా సమస్యలపై చర్చించడానికే గానీ.. రాజకీయ లబ్ధికి కాదు: అమిత్ షా

**ఢిల్లీ:** చట్ట సభలు.. ప్రజాసమస్యలపై చర్చలు జరపడానికే గానీ.. రాజకీయ లబ్ధి పొందేలా వ్యవహరించడానికి కాదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న 'ఆల్ ఇండియా స్పీకర్స్ సమావేశం'లో కేంద్రమంత్రి పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్‌లో జరిగే చర్చలు దేశాభివృద్ధిని ప్రభావితం చేస్తాయని చెప్పారు. "చర్చలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాలు విపక్షాల కారణంగా సజావుగా జరగలేదు. ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. దీని గురించి ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆలోచించాలి. అర్థవంతమైన చర్చలు జరగాలి. సభా గౌరవాన్ని, స్పీకర్ పదవి గౌరవాన్ని పెంపొందించడానికి కృషి చేయాలి. ప్రజాసమస్యలపై నిష్పాక్షపాతమైన చర్చలు జరపడానికి చట్ట సభలను వేదికగా మార్చుకోవాలి. వాటి నిబంధనల మేరకు సమావేశాలు జరిగేలా చూడాలి"అని అన్నారు. సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి తొలి భారతీయ స్పీకర్‌గా పనిచేసిన విఠల్‌భాయ్ పటేల్‌కు కేంద్రమంత్రి అమిత్ షా నివాళులర్పించారు. వందేళ్ల క్రితం స్పీకర్‌గా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికతోనే దేశంలో పార్లమెంటరీ చరిత్ర మొదలైందన్నారు. అప్పటి బ్రిటిష్ పాలనలో 1919 డిసెంబర్ 24న దేశంలో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఏర్పాటైంది. 1925లో విఠల్‌భాయ్ పటేల్ ఈ సభకు స్పీకర్‌గా ఎన్నికయ్యారు.



## బైక్‌పై రొమాన్స్..

### ఆ 'రోమియో-జూలియట్'కు రూ.53వేల జరిమానా

**నొయిడా :** ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని పోలీసులు సూచిస్తున్నప్పటికీ కొందరు మాత్రం తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలిగించే చర్యలకు పాల్పడుతుండటం తరచూ చూస్తున్నాం. ఈ క్రమంలో నొయిడాకు చెందిన ఓ జంట కూడా బైక్‌పై ఆలింగనం చేసుకొని ప్రమాదకర రీతిలో ప్రయాణించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'రోమియో-జూలియట్' చేష్టలను తీవ్రంగా పరిగణించిన యూపీ పోలీసులు.. వారికి రూ.53వేల భారీ జరిమానా విధిస్తూ షాక్ ఇచ్చారు. నొయిడాకు చెందిన ఓ జంట ఇటీవల హెల్మెట్ పెట్టుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బైక్‌పై దూసుకెళ్లారు. ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఉన్నప్పటికీ నిబంధనలు ఉల్లంఘిస్తూ ఎదురెదురుగా కూర్చొని కనిపించారు. వెనక ఉన్న ఓ వాహనదారుడు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది. ఇందుకు సంబంధించిన వీడియోను ఎక్స్‌లో షేర్ చేసిన యూపీ పోలీసులు.. 'లవ్ సాంగ్ కాదు.. ఈసారి భారీ చలానాతో ముగించాం. నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించండి.. మీ ప్రేమకథను చిరకాలం కొనసాగించండి' అంటూ పోస్టు పెట్టారు. దీనిపై యూజర్లు స్పందిస్తూ.. ఆ జరిమానా ఎవరు చెల్లిస్తారు..? రోమియోనా, జూలియట్ లేదా వారి తల్లిదండ్రులా? అంటూ హాస్యంగా ప్రశ్నించారు.

## భారత్.. ట్రంప్‌ను సీరియస్‌గా తీసుకో

### నిక్కీహేలీ సూచన



రష్యా నుంచి చమురు కొనుగోళ్ల విషయంలో ట్రంప్ లేవనెత్తిన అభ్యంతరాన్ని భారత్ సీరియస్‌గా తీసుకోవాలని అమెరికా రిపబ్లికన్ నిక్కీ హేలీ సూచించారు. భారత్‌కు మంచి మిత్రురాలిగా ఆమెకు పేరున్న విషయం తెలిసిందే. న్యూదిల్లీ-వాషింగ్టన్ మధ్య తాజా విభేదాలను ఉద్దేశించి ఆమె ఎక్స్‌లో పోస్టు చేశారు. "రష్యా నుంచి చమురు విషయంలో ట్రంప్ లేవనెత్తిన అభ్యంతరాలను భారత్ సీరియస్‌గా తీసుకోవాలి. దాని పరిష్కారం కోసం వీలైనంత త్వరగా శ్వేతసౌధంతో కలిసి పనిచేయాలి. దశాబ్దాలుగా రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య ఉన్న స్నేహం, విశ్వాసమే.. ప్రస్తుత ఒడుదొడుకులను దాటేందుకు బలమైన పునాదిగా ఉపయోగపడుతుంది. వాణిజ్యంలో, రష్యా చమురుపై అభిప్రాయభేదాలు వంటివి పరిష్కరించుకోవడానికి బలమైన చర్చలు, సంప్రదింపులు అవసరం. చైనాను ఎదుర్కోవడానికి అమెరికాకు న్యూదిల్లీలో మిత్రులు ఉండాలి అన్న అంశం చాలా ముఖ్యమైంది. దానిని ఏమాత్రం విస్మరించకూడదు" అని ఆమె పోస్టు చేశారు. ఆంక్షలు విధించి భారత్‌ను అమెరికా దూరం చేసుకోవడంపై నిక్కీ హేలీ గతంలో కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చైనాను ఎదుర్కోవాలన్న వ్యూహాత్మక లక్ష్యాల సాధనకు ట్రంప్ నిర్ణయాలు విపత్కరంగా మారాయని ఇటీవల ఆమె పేర్కొన్నారు. ఇటీవల ఓ పత్రికకు రాసిన కాలమ్‌లో ఆమె స్పందిస్తూ "ప్రపంచంలో ఆరోవంతు జనాభాకు కేంద్రం భారత్. అత్యంత యువ జనాభాతో చైనాను దాటేసింది. మరోవైపు డ్రాగన్ జనాభాలో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్ " అని పేర్కొన్నారు. మరో వైపు భారత్ లాంటి మిత్రదేశాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూరం చేసుకోవడంపై మాజీ విదేశాంగ మంత్రి జాన్ కెర్రీ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. నిజమైన దౌత్య ప్రయత్నాలు జరగకుండా, అల్టిమేటంలు జారీ చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. భారత్, అమెరికా మధ్య పోరు దురదృష్టకరమని అభివర్ణించారు. "అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీ మధ్య ఈ పోరాటం దురదృష్టకరం. సాధారణ వ్యాపార విధానంలో నిజమైన దౌత్య ప్రయత్నం లేకుండా గొప్ప దేశాలు ఎల్లప్పుడూ ప్రజలకు అల్టిమేటంలు ఇవ్వడం ద్వారా గొప్పతనాన్ని ప్రదర్శించవు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా పాలనలో చర్చలు పరస్పర సహకారం, గౌరవం ద్వారా జరిగాయి. కానీ ఇప్పుడు కొంచెం ఎక్కువ ఆదేశాలు, ఒత్తిడితో జరుగుతున్నాయి" అని జాన్ కెర్రీ తెలిపారు.

### పుతిన్ చర్యలతో సంతోషంగా లేను

రష్యా నుంచి భారత్ చమురు దిగుమతి చేయడంపై అమెరికా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఉక్రెయిన్ యుద్ధానికి ఈ చమురు సొమ్ము ఉపయోగపడుతోందని.. భారత్ అవసరం వెతుక్కోని వ్యాపారం చేస్తోందని ట్రంప్ సలహాదారుడు పీటర్ నవారో తీవ్ర ఆరోపణలు చేశారు. ట్రంప్ 25శాతం పెనాల్టీలను భారత్ దిగుమతులపై విధించారు. ట్రంప్ కార్యవర్గం కీలక నాయకులు న్యూదిల్లీపై తరుచు నోటికొచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారు. మరోవైపు చమురు ధరలు పెరిగితే 150 కోట్ల మంది ప్రజలు ఇబ్బంది పడతారని భారత్ వాదిస్తోంది.



## గగన్‌యాన్ మిషన్.. ఎయిర్ డ్రాప్ టెస్ట్ విజయవంతం

**న్యూఢిల్లీ :** భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ అంతరిక్ష ప్రాజెక్టులో ఇస్రో మరో ముందడుగు వేసింది. క్రూ మాడ్యూల్‌కు సంబంధించిన తొలి ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్టు ను విజయవంతంగా నిర్వహించింది. వాయుసేన, నౌకాదళం, డీఆర్డీవో, కోస్ట్‌గార్డ్‌ల సంయుక్త సహకారంతో ఈ పరీక్షలు చేపట్టింది. ఈ ప్రయోగంలో భాగంగా మాడ్యూల్ నమూనాను హెలికాప్టర్ సాయంతో నింగిలోకి తీసుకెళ్లి.. కిందికి జారవిడిచారు. పారాచూట్ల సాయంతో ఆ మాడ్యూల్ వేగాన్ని తగ్గించుకుంటూ. సముద్ర జలాల్లో సురక్షితంగా దిగింది. మానవసహిత అంతరిక్ష ప్రయోగాల సమయంలో వ్యోమగాములు భూమికి సురక్షితంగా తిరిగి వచ్చేందుకు దీన్ని ఉపయోగిస్తారు. మాడ్యూల్ భూవాతావరణంలోకి ప్రవేశించిన అనంతరం దాని వేగ నియంత్రణ, ల్యాండింగ్ విషయంలో పారాచూట్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. సంక్లిష్టమైన ఈ వ్యవస్థ పనితీరును పరీక్షించడమే లక్ష్యంగా ఈ ప్రయోగం చేపట్టినట్లు సమాచారం. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో చేపట్టిన గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ఇస్రో అనేక పరీక్షలు నిర్వహిస్తోంది. జులైలో సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్ కు సంబంధించి రెండు హాట్ టెస్టులను విజయవంతంగా చేపట్టింది. 2027లో తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఇటీవల వెల్లడించారు.



## పారిపోయేందుకు నొయిడా నిందితుడి యత్నం..

### కాళ్లపై కాల్పులు జరిపిన పోలీసులు

**నొయిడా :** అదనపు కట్నం కోసం తల్లిదండ్రులతో కలిసి.. భార్యను తీవ్రంగా కొట్టి నిప్పంటించి కేసులో నొయిడాకు చెందిన విపిన్‌ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సీన్ రీకన్‌స్ట్రక్షన్‌కు తీసుకువెళ్తుండగా సిర్సా చౌరాహా సమీపంలో పోలీసుల నుంచి గన్ లాక్కొని, పారిపోవడానికి ప్రయత్నించినట్లు తెలిపారు. వెంటనే అతడి కాలిపై కాల్చి..అదుపులోకి తీసుకున్నామన్నారు. భార్యను చంపాననే పశ్చాత్తాపం విపిన్‌లో ఏమాత్రం కనిపించట్లేదని పోలీసులు పేర్కొన్నారు. తన భార్యను తాను హత్య చేయలేదని.. ఆమే పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుందని నిందితుడు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. భార్యాభర్తల గొడవలు సాధారణ విషయాలని..ఈ మాత్రం దానికే నిక్కీ ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏముందంటూ తిరిగి తమనే ప్రశ్నిస్తున్నాడన్నారు. హత్య అనంతరం బంధువులను, పోలీసులను తప్పుదారి పట్టించేందుకు విపిన్ ప్రయత్నించినట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో ఆమెతో ఉన్న ఫొటోలు షేర్‌చేసి.. 'ఆత్మహత్య చేసుకొని..నన్నెందుకు ఒంటరిగా వదిలి వెళ్లిపోయావ్' అంటూ పోస్టులు పెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించిన వీడియో ఆధారంగా అతడిని అరెస్టు చేశామన్నారు.

### మెర్సిడెస్ కారు ఇవ్వలేదనే..

వివాహ సమయంలో కట్నంగా కారు, నగదు, విలువైన వస్తువులు ఇచ్చినప్పటికీ నిక్కీ భర్త విపిన్, అతడి తల్లిదండ్రులు అదనపు కట్నం కోసం హింసించేవారని మృతురాలి తండ్రి పేర్కొన్నాడు. ఇటీవల తాను మెర్సిడెస్ కారు కొనుగోలు చేశానని.. నాటి నుంచి తమకు కూడా అదే కారు ఇప్పించాలని విపిన్ పలుమార్లు ఒత్తిడి తీసుకువచ్చాడన్నారు. ఈ నేపథ్యంలోనే అదనపు కట్నం కోసం ఈ దారుణానికి పాల్పడ్డాడని వాపోయారు. నిందితులకు కఠిన శిక్ష విధించేలా అధికారులను ఆదేశించాలని సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను కోరారు. నొయిడాకు చెందిన నిక్కీ అనే మహిళను గురువారం అదనపు కట్నం కోసం ఆమె భర్త, అత్త తీవ్రంగా కొట్టి..పెట్రోల్ పోసి నిప్పంటించారు. తీవ్రంగా కాలిన గాయాలతో ఉన్న బాధితురాలిని స్థానికుల సహాయంతో ఆమె సోదరి ఆస్పత్రికి తరలించగా అప్పటికే నిక్కీ ప్రాణాలు కోల్పోయింది. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఢిల్లీ సీఎంపై దాడి..

## వెలుగులోకి పలు భద్రతా లోపాలు



**న్యూఢిల్లీ :** దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా సివిల్ లైన్స్‌లోని తన అధికారిక నివాసంలో 'జన్ సున్‌వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ఆమెపై దాడి జరగడం తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై దర్యాప్తు జరిపిన అధికారులు రాజ్ నివాస్ మార్గ్‌లోని ఆమె అధికారిక నివాసంలో భద్రతా లోపాలను గుర్తించారు. నిందితుడు గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన ఆటో డ్రైవర్ సకారియా రాజేశ్‌భాయ్ ఖిమ్జీభాయ్(41)గా గుర్తించి ఇదివరకే అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై విచారణ జరిపిన అధికారులు.. లోపాల కారణంగా 'పెను ప్రమాదం' సంభవించే అవకాశాన్ని ప్రస్తావించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా హోం మంత్రిత్వ శాఖకు నివేదికను సమర్పించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ దాడి తర్వాత సీఎం రేఖా గుప్తాకు కేంద్ర ప్రభుత్వం జెడ్ కేటగిరీ భద్రతను కల్పించింది. ఇందులో 20-22 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది ఆమెకు భద్రతకు కల్పిస్తారని అధికారులు 'ఈటీవీ భారత్'కు తెలిపారు. నిరంతరం ఆమెకు రక్షణ కల్పించడానికి అదనపు సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు.

### కాంప్లెక్స్‌లోకి వెళ్లడానికి, రావడానికీ ఒక్కటే గేటు

రెండు నెలల కిందట, సీఎం రేఖాగుప్తాకు 1/8 , 2/8 రాజ్ నివాస్ మార్గ్‌లో రెండు బంగ్లాలు కేటాయించారు. అందులో ఆమె ఒకదాన్ని తన నివాసంగా, మరొకటి క్యాంప్ కార్యాలయంగా ఉపయోగిస్తున్నారు. ఈ కాంప్లెక్స్‌లో మరో రెండు బంగ్లాలు కూడా ఉన్నాయి. వాటిని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి రవి ఇంద్రరాజ్ సింగ్, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్‌లకు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. నాలుగు బంగ్లాలకు ప్రవేశించడానికి, బయటకు వెళ్లేందుకు మార్గం ఒక్కటే ఉండటం ప్రధాన భద్రతా లోపం అని అధికార వర్గాలు పేర్కొన్నాయి. నివేదికలో వెలుగులోకి వచ్చిన మరో లోపం ఏమిటంటే.. సిబ్బంది, అక్కడికి వచ్చే సందర్శకులు ఒకే మార్గాన్ని ఉపయోగించడం. దీంతో ప్రతి ఒక్కరినీ నిశితంగా పరిశీలించడం కష్టంగా మారిందని ఆయా వర్గాలు పేర్కొన్నాయి. భాజపా ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ గోయల్ దీనిపై స్పందించారు. నిర్మాణ సంబంధిత సమస్యలను కూడా ఎత్తి చూపారు. కాంప్లెక్స్ ప్రహరీ గోడ ఎత్తు చాలా తక్కువగా ఉందన్నారు. ఎవరైనా సులభంగా లోపలికి దూకే విధంగా ఉందని తెలిపారు. "కాంప్లెక్స్‌కు మూడు వైపులా ప్రైవేట్ అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. భద్రతా సిబ్బంది నిరంతరం నిఘా నిర్వహించడం కష్టతరంగా మారింది" అని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నివాసం చుట్టుపక్కల ఉన్న సీసీటీవీ కెమెరాలను కూడా అప్‌డేట్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అన్ని రాష్ట్రాల మాదిరిగా దిల్లీ ముఖ్యమంత్రికి శాశ్వత నివాసం లేదన్నారు. రేఖా గుప్తా బంగ్లా టైప్-7 అని, సాధారణంగా ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కేటాయించే టైప్-8 ఇళ్ల కంటే కాస్త చిన్నదిగానే ఉంటుందని అధికారులు తెలిపారు.



## 'ఆ సూచన నాకూ వర్తిస్తుంది'..

### పెళ్లిపై రాహుల్ గాంధీ సరదా వ్యాఖ్యలు

**బిహార్ :** తన పెళ్లి విషయంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సరదా వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై ఆర్జేడీ అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్‌తో మాటామంతీ కొనసాగుతోందని తెలిపారు. 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా బిహార్‌లోని అరారియాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, రాహుల్ గాంధీ మధ్య ఈమేరకు సంభాషణ సాగింది. సమావేశంలో భాగంగా తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ.. కేంద్రమంత్రి, ఎల్‌జేపీ (రామ్‌విలాస్) నేత చిరాగ్ పాసవాన్ ఇక పెళ్లి చేసుకోవాలంటూ సూచించారు. ఈ క్రమంలోనే పక్కనే కూర్చున్న రాహుల్ గాంధీ వెంటనే మైక్ అందుకుని.. 'ఈ సూచన నాకూ వర్తిస్తుంది.' అని వ్యాఖ్యానించారు. 'ఇదే విషయాన్ని మా నాన్న ఎప్పటినుంచో చెబుతున్నారు కదా' అని తేజస్వీ బదులిచ్చారు. 'అవును. దీనిపై ఆయనతో చర్చలు కొనసాగుతున్నాయి' అని రాహుల్ బదులిచ్చారు. ఈ సరదా సంభాషణతో అక్కడ నవ్వులు విరబూశాయి. రాహుల్ గాంధీ పెళ్లిపై రెండేళ్ల క్రితం పట్నాలో లాలూప్రసాద్ యాదవ్ తనదైన శైలిలో నవ్వులు పూయించిన సంగతి తెలిసిందే. "మా మాట విను.. పెళ్లి చేసుకో. మేమంతా నీ బరాత్‌కు రావాలనుకుంటున్నాం. వివాహానికి విముఖత చూపుతుండటంతో మీ అమ్మ (సోనియా గాంధీ) ఆందోళన చెందుతోంది" అని వ్యాఖ్యానించారు. తాజా సమావేశంలో ఇదే విషయాన్ని రాహుల్ ప్రస్తావనకు తీసుకొచ్చినట్లు సమాచారం.

## బాపట్ల జిల్లాలో భారీ చోరీ..

### కంటెయినర్ నుంచి 255 ల్యాప్‌టాప్‌లు మాయం

**మేదరమెట్ల:** బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం మేదరమెట్ల వద్ద భారీ చోరీ జరిగింది. కంటెయినర్ లారీ నుంచి సుమారు 255 ల్యాప్‌టాప్‌లను దుండగులు అపహరించారు. ముంబయి నుంచి చెన్నైకి ఓ కంపెనీకి చెందిన ఎలక్ట్రానిక్ వస్తువులు నాలుగు కంటైనర్లలో తరలిస్తున్నారు. ఈ క్రమంలో అద్దంకి మండలం చిన్నకొత్తపల్లి వద్ద కంటెయినర్ అలారం బ్రేక్ అయినట్టు కంపెనీ ప్రతినిధులకు సమాచారం వెళ్లింది. ఈ ఘటన శనివారం ఉదయం చోటు చేసుకోగా.. కంటెయినర్‌ను అక్కడే వదిలేసి లారీ డ్రైవర్, క్లీనర్ పరారయ్యారు. దీనిపై కంపెనీ ప్రతినిధులు ఆదివారం మేదరమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని చీరాల డీఎస్పీ మొయిన్ తెలిపారు. చోరీకి గురైన ల్యాప్‌టాప్‌ల విలువ సుమారు రూ.1.85 కోట్లు ఉంటుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.



## వినాయక శాశ్వత మండపాన్ని ప్రారంభించిన నాయకులు

**నాగారం, ఆగస్టు 24 :** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో ఆదివారం నూతన వినాయక శాశ్వత మండ పాన్ని ఆదివారం మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు,మాజీ వార్డు సభ్యులు చిన్నంరాజు సాయినాథ్ గౌడ్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నిమ్మల శ్రీనివాస్,బండారి శ్రీకాంత్ యాదవ్,కాలనీ అధ్యక్షులు కిష్టన్నగారి రవి,వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, మచరయ్య,డి.కృష్ణ, ప్రకాష్ కుమార్ కాలనీ వాసులు తదితరులు పాల్గొనారు.




## ప్రశాంత్‌నగర్ కాలనీలో నూతన కార్యవర్గం

### ముప్పు శ్రీనివాస్ రెడ్డిని కలిసిన నూతన కార్యవర్గ సభ్యులు

**నాగారం, ఆగస్ట్ 24 :** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ప్రశాంత్ నగర్ కాలనీలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు.ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు ఎర్రబోయిన కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న మంచినీరు, రోడ్లు,డ్రైనేజీ తదితర సమస్యలపై కాలనీ కార్యవర్గ సభ్యులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రం అందజేశారు.వెంటనే ఆయన స్పందించి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్ దృష్టికి తీసుకువెల్లి మీ కాలుని సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

## అమెరికా డిమాండ్లకు తలొగ్గం : ఖమేనీ



**ఇరాన్ :** అమెరికాపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మ-రోసారి మండిపడ్డారు. తమను లొంగదీసుకోవడానికి అమెరికా ప్రయత్నాలు చేస్తోందని, దీనిని ఎదుర్కొనేందుకు కలిసి కట్టుగా పోరాడదామని భాగస్వామ్య పక్షాలకు పిలుపునిచ్చారు. ఎట్టిపరిస్థితుల్లోనూ అమెరికాకు తలొగ్గే ప్రసక్తే లేదని అయతొల్లా స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి అధికారిక వెబ్‌సైట్‌లో ఓ ప్రకటన చేశారు. జూన్‌లో తమ అణు కేంద్రాలను లక్ష్యంగా ఇజ్రాయెల్, అమెరికాలు దాడి చేయడం ప్రతీకార చర్యను ప్రేరేపించిందన్నారు. టెహ్రాన్‌ను అస్థిరపరిచేందుకే అమెరికా ప్రణాళిక రూపొందించిందని ఖమేనీ ఆరోపించారు. ఇటీవల యుద్ధం ప్రారంభ ంలో.. ఇజ్రాయెల్ దాడి చేసిన మరుసటి రోజు అమెరికన్ ఏజెంట్లు యూరప్‌లో భేటీ అయ్యారని, ఇరాన్‌ను తదుపరి ఏ ప్రభుత్వం పాలించాలి అనే విషయంపై చర్చించారని అన్నారు. అంతిమంగా ఇరాన్ విధేయతగా ఉండాలని అమెరికా కోరుకుంటోందని చెప్పారు. ఇజ్రాయెల్ దాడిని ప్రస్తావించిన ఆయన.. ప్రభుత్వం సహా ఇరాన్ మొత్తం తమ సైన్యానికి అండగా నిలబడిందన్నారు. ఈ క్రమంలో శత్రువులను దెబ్బతీశామన్నారు. అంతర్గత విభేదాలపై హెచ్చరించిన ఆయన.. విదేశీ శక్తులు రెచ్చగొడుతున్నాయన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



**వలిగొండ, రాజముద్ర న్యూస్:** క్రిమిసంహారక మందు సేవించి వ్యక్తి మృతి చెందిన ఘటన వలిగొండ మండలంలోని దుప్పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల ప్రకారం దుప్పల్లి గ్రామానికి చెందిన నారబోయిన ఉప్పలయ్య (56) మంచినీరు అనుకొని పురుగుల మందు తాగడంతో వాంతులు, విరోచనాలు అయ్యాయి. దీనితో రామన్నపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అనంతరం మెరుగైన వైద్యం కోసం నలగొండకు తరలించారు. అనంతరం చికిత్స పొందుతూ మరణించడం జరిగింది. ఇట్టి విషయంపై మృతుని కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై యుగేందర్ గౌడ్ తెలిపారు.



## అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనం పట్టివేత

**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ యుగేందర్ తెలిపారు. మండల పరిధిలోని తొర్రూరు క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం తెల్లవారుజామున పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా ఎలాంటి పత్రాలు లేకుండా అశోక్ లేలాండ్ వాహనంలో 14 పశువులను రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లాకు చెందిన జోగు శివాజీని అదుపులోకి తీసుకుని విచారించగా,పశువులను శ్రీకాకుళం మార్కెట్లో కొనుగోలు చేసి హైదరాబాద్ లోని తుక్కుగూడలో వధశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. పశువులతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై యుగేంధర్ తెలిపారు.

# జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వైద్య శిబిరం

- వాలంటీర్ల కృషి అభినందనీయం
- రాష్ట్ర అధ్యక్షుడు చెలిమల రాజేశ్వర్




**చర్లపల్లి, ఆగస్టు 24 :** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం శ్రీచక్రి విద్యానికేతన్ పాఠశాలలో 120వ ఉచిత వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల జరుగుతున్న బీపీ,షుగర్ మెడికల్ క్యాంపులు ఈ నెలతో 10 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్నాయి.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు చెలిమల రాజేశ్వర్ మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలను అరికట్టడం,విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడం, పేదలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వేదిక ప్రధాన లక్ష్యం అన్నారు.నిరంతరం సేవలందిస్తున్న మేడ్చల్ జిల్లా కమిటీ కృషి అభినందనీయ మన్నారు.వాలంటీర్లు, వైద్యులు, కార్యకర్తల శ్రమ వల్లే ఈ శిబిరాలు విజయవంతం అవుతున్నాయని సభ్యులను కొనియాడారు. ముఖ్య అతిథులుగా హాజరైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సీతారాం రెడ్డి,వెంకట్ రెడ్డి,కొత్త అంజిరెడ్డి మాట్లాడుతూ బీపీ, షుగర్ వంటి వ్యాధుల చికిత్స కోసం పేదలు వేలకు వేలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి వస్తోంది.అలాంటి సందర్భంలో ఉచిత వైద్య శిబిరాలు నిరుపేద ప్రజలకు ఎంతో మేలు అన్నారు. విజ్ఞాన వేద తదుపరి రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఎన్.రెడ్డి, వరప్రసాద్, ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్ర విజ్ఞాన ప్రచారం, శాస్త్రీయ ఆలోచనా దృక్పథం పెంపొందించడానికి వేదిక కృషి చేస్తోంది. మూఢనమ్మకాలు, ఛాందస భావాలను అరికట్టేందుకు ప్రచారంతో పాటు ఆరోగ్య సమస్యల పరిష్కారానికి నిరంతరం శిబిరాలు నిర్వహించడం వేదిక ప్రత్యేకత అని పేర్కొన్నారు. కుషాయిగూడ(జమ్మిగడ్డ) బస్తి దవాఖాన వైద్యురాలు డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు,కార్యకర్తలను అభినందిస్తూ వారి సేవాభావం సమాజానికి ఆదర్శప్రాయమని ప్రశంసించారు. క్యాంపులో వైద్యులు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పి.నాగరాజు, రాష్ట్ర ఎడ్యుకేషన్ సబ్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వర్ రావు, చెఖుమికి ఎడిటర్ ఆనంద్ కుమార్,రాష్ట్ర హెల్త్ సబ్ కమిటీ కో-కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు, కోశాధికారి తోట శ్రీనివాస్, డాక్టర్లు రమాదేవి, శైలజ, జయరాజ్, విద్యాసాగర్, దేవిక, దీప్తి, నవనీత, చక్రి హై స్కూల్స్ ప్రిన్సిపాల్ స్వప్న,సైకాలజిస్ట్ డాక్టర్ మనోహర్, మెడికల్ క్యాంపు కన్వీనర్ జి.కరుణాకర్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, వాలంటీర్లు సోమయ్య చారి,శేషు,శేషగిరిరావు, దుర్గాచారి, ఎం.ఎల్.చౌదరి, నాగేశ్వర్ రావు, వెంకటరమణ, నవీన్ యాదవ్, ఉజ్మా, ఆశా, సంజన, మధుసూదన్ రావు, శశంక, యశోద హాస్పిటల్ ఇంచార్జి అఖిల్,తదితరులు పాల్గొన్నారు.







## అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే అమిత్‌షా ఆరోపణలు : స్టాలిన్



**తమిళనాడు :** నక్సలిజంపై ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని కేంద్ర మంత్రి అమిత్ షా లక్ష్యంగా చేసుకోవడాన్ని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ఖండించారు. కేంద్రం ఈ సమస్యను పరిష్కరించలేకపోయిందని, తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే ఆయన్ను లక్ష్యంగా చేసుకుందని ఆరోపించారు. ఉప రాష్ట్రపతి పదవికి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పూర్తి అర్హత కలిగిన వ్యక్తి అని స్టాలిన్ పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో డీఎంకే, మిత్రపక్షాల మద్దతు కోరుతూ జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి చెన్నైలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సీఎం స్టాలిన్ ప్రసంగించారు. కేవలం ఇండియా కూటమి నేతలే కాకుండా.. ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న వారందరూ జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డినే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా అంగీకరించారన్నారు. ఆయన తన జీవితాన్ని న్యాయవ్యవస్థకు అంకితం చేశారని, రాజ్యాంగ గౌరవాన్ని నిలబెట్టారని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు భాజపా యత్నిస్తున్న నేపథ్యంలో.. దానిని కాపాడేందుకు ఆయన అవసరం ఉందని చెప్పారు. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి న్యాయమూర్తిగా పనిచేసిన రోజుల్లో నక్సలిజానికి మద్దతుగా తీర్పులిచ్చారని అమిత్ షా ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి స్టాలిన్ స్పందిస్తూ.. కేంద్ర హోంశాఖ మంత్రి తన బాధ్యతను మరచి.. ఆయనపై అన్యాయమైన ఆరోపణలు చేశారని విమర్శించారు. భాజపా ప్రభుత్వం నక్సలిజాన్ని అంతం చేయలేకపోయిందని, అందుకే తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ఆయన్ను నిందించేందుకు యత్నిస్తోంద న్నారు. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకునేందుకు దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తోందని ఆరోపించారు.

## అధిక లాభాలంటూ రూ.7 కోట్ల సైబర్ మోసం

### ఇద్దరిని అరెస్టు చేసిన ఒడిశా పోలీసులు



**ఒడిశా :** తమ సంస్థల్లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ ఆశ చూపి రూ.7 కోట్లకు పైగా సైబర్ మోసానికి పాల్పడిన ఇద్దరు నిందితులను ఒడిశా పోలీసులు అరెస్టు చేశారు. వేర్వేరు సైబర్ నేరాలకు సంబంధించి గుంటూరుకు చెందిన చాపలమడుగు సుధీర్‌కుమార్(33), ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పుర్‌కు చెందిన బిట్టుకుమార్(41)లను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఒకరైన బిట్టు అధిక లాభాలు ఇస్తామంటూ డిజిటల్ ప్లాట్‌ఫాం వేదికగా పలు పలువురిని రూ.6.16 కోట్ల వరకు మోసగించాడు. వారిలో ఒడిశాకు చెందిన బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడిని పంజాబ్‌లోని లుధియానాలో అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడైన సుధీర్ ఇదే తరహాలో రూ.1.01 కోట్ల మోసానికి పాల్పడ్డాడు. సొమ్ము తిరిగి చెల్లించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేసిన పోలీసులు గుంటూరులో సుధీర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక

### సంఘం అభివృద్ధికై కృషి చేస్తా : గంజి వెంకటేశ్వర్లు



**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** మండల కేంద్రంలో నూతన పద్మశాలి సంఘం పట్టణ కమిటీని ఆదివారం సాయిగణేష్ ఫంక్షన్ హాల్లో పద్మశాలి కులస్తులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా సాయిని యాదగిరి, అధ్యక్షులుగా గంజి వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షులు దొంత శ్యామ్ సుందర్, కందగట్ల వెంకటేశం. ప్రధాన కార్యదర్శి రచ్చ సంతోష్, కోశాధికారి నామాల జగన్మోహన్, సహాయ కార్యదర్శి ఎక్కలదేవి శ్రీనివాస్,సంస్కృతిక కార్యదర్శి యలగందుల లెనిన్, డైరెక్టర్లు పెండెం విగ్నేష్ , గంజి ఉపేందర్, గర్దాస్ మనోహర్, బడుగు లింగస్వామి ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఎన్నికైన నూతన అధ్యక్షులు గంజి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన కుల పెద్దలందరికీ కృతజ్ఞతలు జేస్తూ,నాకు ఇచ్చిన బాధ్యతను నిస్వార్థంగా, సమర్థవంతంగా నిర్వహిస్తానని వలిగొండ పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బడుగు సత్యనారాయణ గంజి నారాయణ దొంత శంకరయ్య జెల్ల నరేందర్, ఐటిపాముల కుమార్, ఐటి పాముల ప్రభాకర్, ఐటిపాముల రవీంద్ర, గంజి బాలనరసింహ, కూరపాటి భూమయ్య రాపోలు సుధాకర్, గుంటి రవీందర్, పున్న ఆంజనేయులు, బోడ కుమార్, మిర్యాల భాస్కరు, మిర్యాల వెంకటేశం, రాపోలు శ్రీను, వంగరి రమేష్ మిరియాల శీను పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం అందించిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** ఇటీవల డెంగ్యూ వ్యాధితో వలిగొండ మండలంలోని నాగారం గ్రామానికి చెందిన మంగ మహేష్ మృతి చెందగా వారికి సానుభూతిని తెలియజేస్తూ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి సౌజన్యంతో సమకూర్చిన పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు ఆదివారం మాజీ జెడ్పిటిసి మొగుళ్ల శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండి సలీం, గ్రామ శాఖ అధ్యక్షుడు బర్ల నాగార్జున్, బొడిగె చందు, మైసోళ్ల సత్యం, కాడిగళ్ళ యాదయ్య, బర్ల బీరప్ప, బుంగ ప్రవీణ్, పాలేర్ల మహేష్, మైసోళ్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## ఇస్లాం మత ఆచారాలపై మహిళలకు అవగాహన సదస్సు





**నాగారం, ఆగస్టు 24 :** సమాజంలో ఇస్లాం మత ఆచారాలపై ఇస్లాం మహిళలకు మరింత అవగాహన కల్పించేం దుకు ఆదివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని స్టార్ ఫంక్షన్ హాల్ లో ముస్లిం మత పెద్దలు మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు జిల్లా కన్వీనర్ సయ్యద్ ఒమర్ షఫీక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు భారీ సంఖ్యలో ముస్లిం మహిళలు యువకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ఇస్లాం మతంలో ఉన్న ఆచారాలను మహిళలు తప్పనిసరిగా ఆచరించాలన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతు న్న అత్యాచారాలు, మానభంగాల నుండి బహు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. స్కూల్, కాలేజీలకు వెళ్లే ఆడపిల్లల పట్ల తమ తల్లిదం డ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వర్క్ బోర్డు బిల్ వ్యతిరేకతపై సమావేశం ప్రశాంతంగా జరుపుకున్నా రు.ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ మాజీ కో-ఆప్షన్ సభ్యులు అదం షఫీక్, అనీస్, బీబ్, జా, గౌస్, అక్బర్, అజీమ్, మహమూద్, యూసుఫ్, ఇస్లాం, రైస్, అష్రఫ్, హనీఫ్, షఫీ, స్థానిక ముస్లిం మహిళలు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అదనపు పని గంటలపై ఉద్యోగులు ఏమంటున్నారు..?



పని గంటల పొడిగింపునకు సంబంధించి చర్చ జరుగుతోన్న వేళ ఓ సర్వే కీలక విషయాలు వెల్లడించింది. అదనపు ప్రయోజనాలు లేదా సౌలభ్యం లేకుండా పనిగంటలు పొడిగించడం అనే ఆలోచనపై ఎక్కువ మంది ఉద్యోగులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నట్లు తేలింది. ఇవి వ్యక్తిగత సమయం, ఆరోగ్యంతోపాటు పని-జీవన సమతుల్యతపై ప్రతికూల ప్రభావం చూపుతున్నట్లు సర్వేలో పాల్గొన్న వారిలో 44శాతం మంది అభిప్రాయపడినట్లు తాజా నివేదిక వెల్లడించింది. జీనియస్ డిజిపోల్ అనే మానవ వనరుల కన్సల్టెన్సీ 'పని గంటల పొడిగింపు' అంశంపై ఇటీవల ఆన్‌లైన్ సర్వే నిర్వహించింది. జులై 1 నుంచి 31 మధ్య కాలంలో చేసిన ఈ సర్వేలో దాదాపు 2076 మంది ఉద్యోగులు పాల్గొన్నట్లు వెల్లడించింది. ఇందులో మెజార్టీ ఉద్యోగులు వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని చెప్పగా.. తగిన పరిహారం అందిస్తే ఎక్కువ పని గంటల విషయాన్ని అంగీకరిస్తామని సర్వేలో పాల్గొన్న 40శాతం మంది చెప్పారు. మరో 16శాతం మంది మాత్రం ఈ విధానాన్ని ప్రయత్నించేందుకు సంసిద్ధంగా ఉన్నామని లేదా ఉత్పాదకతను మరింత పెంచేందుకు దోహదం చేస్తుందని భావిస్తున్నామని అన్నారు. పని గంటలకు సంబంధించి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం, పారదర్శకతపై ఉద్యోగులు స్పష్టమైన వైఖరితో ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. ఈ సంప్రదింపుల్లో తమకు కూడా భాగస్వామ్యం ఉండాలని దాదాపు 79శాతం మంది కోరుకున్నట్లు తెలిపింది. అంతేకాదు.. అటువంటి చర్చలు బహిరంగంగా ఉండటంతోపాటు విధాన రూపకల్పన పారదర్శకంగా జరగాలని ఆశిస్తున్నారని పేర్కొంది. "నేటి శ్రామికశక్తి మార్పునకు వ్యతిరేకంగా లేదు. నిష్పక్షపాత, ఆలోచనలను పంచుకోవడం, సంప్రదింపులను కోరుకుంటోంది. ఆలోచనాపరమైన ప్రణాళిక లేకుండా ఎక్కువ పని చేయించడం ఉద్యోగులు, యాజమాన్యాల మధ్య దూరాన్ని పెంచుతుంది. ఉత్పాదకత అనేది కేవలం ఉద్యోగులు వెచ్చించే సమయంపైనే కాకుండా వాళ్ల శక్తి యుక్తులపై ఆధారపడి ఉంటుందని సంస్థలు గుర్తించాలి" అని జీనియస్ హెచ్ఆర్‌టెక్ వెల్లడించింది.



## ఇంగ్లీష్ అంటే భయం..

### అందుకే లాస్ట్ బెంచ్‌లో కూర్చొనే వాడిని : విజయ్ శర్మ

ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. కాలేజీలో ఇంగ్లీష్ రాకపోవడం వల్ల ఎదుర్కొన్న ఇబ్బందులను 'ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో'లో గుర్తుచేసుకున్నారు. పాఠశాలలో టాపర్‌గా ఉన్నా ఇంగ్లీష్ భాషపై పట్టులేకపోవడం వల్ల ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చిందని ఈ సందర్భంగా చెప్పారు. నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారమయ్యే ఈ షో తాజా ఎపిసోడ్‌లో భారత్‌కు చెందిన పారిశ్రామికవేత్తలు పేటీఎం విజయ్ శేఖర్ శర్మ, బోట్ సంస్థ వ్యవస్థాపకుడు అమన్ గుప్తా, మామాఎర్త్ గజల్ అలఘ్, ఓయో రితేశ్ అగర్వాల్ పాల్గొన్నారు. వీరిలో విజయ్ శర్మ తన కెరీర్‌లో ఎదురైన సవాళ్లను వెల్లడించారు. డిజిటల్ లావాదేవీల రంగలో విప్లవం సృష్టించిన ఆయన.. పేటీఎం ఇంటి పేరుగా మారింది. ఈ విజయగాథ వెనుక విద్యార్థి దశలో ఎదురైన కఠినమైన పరిస్థితులు కూడా ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో టాపర్ అని, ఎప్పుడూ ఫస్ట్ బెంచ్‌లో కూర్చొనే వాడినని తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్ సమీపంలోని చిన్న గ్రామం నుంచి వచ్చిన ఆయనకు ఇంగ్లీష్ అంటే భయమని, దీంతో కాలేజ్‌లో లాస్ట్ బెంచ్‌కి వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నారు. 'తారే జమీన్ పర్' సినిమాలో బాలుడిని చూస్తే తాను అయోమయంలో పడిన సన్నివేశాలు గుర్తొన్నాయని చెప్పారు. భారత్‌లో ఇంగ్లీష్ ఆధిపత్యం పెరిగిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. విదేశీ భాషలతో ఇబ్బంది పడేవారు ఇంగ్లీష్‌కు బదులుగా ప్రతి ఒక్కరు తమకు అనుకూలమైన భాషలోనే లక్ష్యాలను సాధించాలన్నారు. జీవితంలో సవాళ్లను ఎదుర్కొన్న విజయ్ ఆ తర్వాత పేటీఎంను స్థాపించారు. సాధారణ ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా డిజిటల్ పేమెంట్స్‌ను పరిచయం చేశారు. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం విజయ్ శేఖర్ శర్మ వ్యక్తిగత ఆస్తులు దాదాపు 1.4 బిలియన్ డాలర్లు (రూ.12,000 కోట్లు).

### భారత భద్రతా నిబంధనలతోనే

## స్టార్‌లింక్ సేవలకు గ్రీన్‌సిగ్నల్




బిలియనీర్ ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్ సంస్థకు స్థానికంగా శాటిలైట్ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించేందుకు భారత్ అనుమతించింది. అయితే భారతీయ వినియోగదారుల డేటాను విదేశాలకు రూటింగ్ చేయడం, కాపీ చేయడం, డీక్రిప్ట్ చేయడం వంటివి నిషేధమని కేంద్రం స్పష్టం చేసింది. యూజర్ ట్రాఫిక్ ఎక్కడా విదేశీ సర్వర్‌లకు మిర్రర్ అవకుండా ఉండేందుకు దేశంలోనే ఎర్త్ స్టేషన్ గేట్‌వేలను ఏర్పాటు చేయాలని షరతులు విధించింది. ఈ నిబంధనలకు అంగీకరించిన తర్వాతే టెలికమ్యూనికేషన్ విభాగం స్టార్‌లింక్‌కి యూనిఫైడ్ లైసెన్స్ మంజూరు చేసినట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. భద్రతా నిబంధనల ప్రకారం భారత్‌లో ఎర్త్ స్టేషన్ గేట్‌వేలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని పెమ్మసాని చెప్పారు. వీటి ప్రకారం.. భారతీయ వినియోగదారుల శాటిలైట్ కమ్యూనికేషన్ ట్రాఫిక్ ఏ విధంగానూ విదేశాల్లోని గేట్‌వేల ద్వారా వెళ్లకూడదు. భారతీయ డేటాను విదేశాల్లో కాపీ చేయడం, డీక్రిప్ట్ చేయడం పూర్తిగా నిషేధం. యూజర్ ట్రాఫిక్‌ను ఎక్కడా విదేశీ సర్వర్‌లకు మిర్రర్ చేయకూడదు. అలాగే శాటిలైట్ ఆధారిత సేవలందించడానికి స్పెక్ట్రం కేటాయింపు, స్పెక్ట్రం ధరలతో సహా నిబంధనలపై టెలికాం నియంత్రణ సంస్థ (ట్రాయ్) సిఫార్సులు కోరిందని.. ఆ సిఫార్సులు మే 9న అందాయని ఆయన తెలిపారు. "ఉపగ్రహ ఆధారిత కమ్యూనికేషన్ సేవలు రాబోయే కాలంలో పెద్ద ఆర్థిక కార్యకలాపాలుగా ఎదుగుతాయి. దీని ద్వారా ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయి. ముఖ్యంగా టెలికాం నెట్‌వర్క్ ఇన్‌స్టాలేషన్, ఆపరేషన్, మెయింటెనెన్స్ వంటి విభాగాల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయని" అని మంత్రి పేర్కొన్నారు.

## ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌లో సమస్యలు..

### వినియోగదారుల ఫిర్యాదులు..?



ప్రముఖ టెలికామ్ దిగ్గజం ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌లో సమస్యలు వస్తున్నట్లు వినియోగదారులు ఫిర్యాదులు చేస్తున్నారు. తాజాగా ఆ సంస్థ ట్విటర్ ఖాతాలో కూడా దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి ప్రశ్నించగా సంస్థ సమాధానం ఇస్తోంది. డౌన్‌డిటెక్టర్‌లో కూడా ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌లో హైదరాబాద్‌లో సమస్యలు ఉన్నట్లు చూపిస్తోంది. దేశవ్యాప్తంగా నేటి ఉదయం 10 గంటల తర్వాత ఇబ్బందులు మొదలైనట్లు తెలుస్తోంది. డౌన్‌డిటెక్టర్‌లో మధ్యాహ్నం 12.27 సమయానికి 6,905 మంది ఫిర్యాదులు చేశారు. మధ్యాహ్నం 1.30 సమయానికి సమస్య పరిష్కారం అయినట్లు డౌన్‌డిటెక్టర్ డేటా చెబుతోంది. గత వారం కూడా ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ దేశంలోని పలు ప్రాంతాల్లో డౌన్ అయింది. అహ్మదాబాద్, దిల్లీ, చండీగఢ్, లఖ్‌నవూ, కోల్‌కతా, గువహటి, ముంబయి, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి పెద్ద సంఖ్యలో వినియోగదారులు అప్పుడు ఫిర్యాదులు చేశారు.



## చిన్ని గుండెలకు 'తెర' కాటు

పిల్లలు మరీ ఎక్కువసేపు ఫోన్, ట్యాబ్లెట్లు, టీవీలకు అతుక్కుపోతున్నారా? వీటి ధ్యాసలో పడి కంటి నిండా నిద్ర పోవటం లేదా? అయితే ఆలోచించాల్సిందే. అతిగా డిజిటల్ పరికరాల వాడకంతో అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, ఇన్సులిన్ నిరోధకత తలెత్తే అవకాశాలు పెరుగుతున్నట్టు అమెరిన్ హార్ట్ అసోసియేషన్ పత్రికలో ప్రచురితమైన తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. రాత్రిపూట తక్కువసేపు నిద్రించే వారికి వీటి ముప్పు మరింత ఎక్కువగా ఉండటం గమనార్హం. డిజిటల్ తెరల వాడకం నిద్ర సమయాన్ని 'దొంగిలించటం' ద్వారా హానికరంగా పరిణమిస్తున్నట్టు అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి. అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, ఇన్సులిన్ నిరోధకతలన్నీ గుండెకు చేటు చేసేవే. అందుకే వీటిని గుండెజీవక్రియ జబ్బులుగా పరిగణిస్తారు. ఈ అధ్యయనంలో యుక్తవయసు పిల్లలను రెండు బృందాలుగా విభజించి టెక్నాలజీ వాడకం, నిద్ర, ఆరోగ్య సమాచారాన్ని విశ్లేషించారు. వీరందరినీ పుట్టినప్పటి నుంచీ గమనిస్తూ వచ్చారు. 10, 18 ఏళ్లలో శరీర తీరుతెన్నులను పరీక్షించారు. నడుం చుట్టుకొలత, సిస్టాలిక్ రక్తపోటు, మంచి కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు, గ్లూకోజు మోతాదుల ఆధారంగా గుండె జీవక్రియ ముప్పు స్కోర్‌ను అంచనా వేశారు. ఫోన్, ట్యాబ్లెట్, టీవీలకు అతుక్కుపోయే ప్రతి అదనపు గంటకూ ఇది గణనీయంగా పెరుగుతున్నట్టు తేలింది. కొందరు పిల్లలు రోజుకు మూడు నుంచి ఆరు గంటల వరకూ వీటిని చూస్తుండటం ఆందోళనకరమని పరిశోధకులు చెబుతున్నారు. పిల్లల్లో తెరల వాడకాన్ని పరిమితం చేస్తే దీర్ఘకాలంలో గుండె, జీవక్రియల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు.




# ఆన్‌లైన్ షాపింగ్ మోసాల నుంచి ఎలా రక్షించుకోవాలి?

**గత కొన్ని సంవత్సరాలుగా ఆన్‌లైన్ షాపింగ్‌ను ఎంచుకునే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కంపెనీలు ఎటువంటి అదనపు ఛార్జీలు/కనీస ఛార్జీలు లేకుండా డెలివరీ చేస్తున్నందున, ఇవి కొనుగోలుదారులకు చాలా సౌకర్యవంతంగా మారాయి. వినియోగదారుల ఆన్‌లైన్ కొనుగోళ్ల డిమాండ్ పెరగడంతో, ఎప్పటికప్పుడు మరిన్ని ఈ-కామర్స్ వెబ్‌సైట్లు పుట్టుకొస్తున్నాయి. అయితే, ఆన్‌లైన్ డిమాండ్‌లో ఈ భారీ పెరుగుదల ఆన్‌లైన్ షాపింగ్ స్కాంలకు కూడా దారితీస్తున్నాయి. ఇటువంటి మోసాలు ఎలా జరుగుతాయి, వీటి బారి నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి వంటి విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.**


ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే వినియోగదారుల సంఖ్య విరివిగా పెరగడంతో ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు కూడా మరిన్ని పెరిగాయి. వినియోగదారులు ఖరీదైన స్మార్ట్‌ఫోన్లను ఆర్డర్ చేస్తే, దానికి బదులుగా కస్టమర్లకు ఇటుక ముక్కలు/సబ్బులు/షాంపూలు అందిన రోజులు కూడా ఉన్నాయి. మోసపూరిత ఆన్‌లైన్ రిటైలర్లు చట్టబద్ధంగా కనిపించే స్టోర్‌లను ఏర్పాటు చేస్తారు, భారీగా తగ్గింపు ధరలకు ఉత్పత్తులను అందిస్తామని ప్రకటనల్లో పేర్కొంటారు. అయితే, చెల్లింపులు అందుకున్న తర్వాత, వారు ఉత్పత్తులను డెలివరీ చేయడంలో విఫలమవుతారు లేదా నకిలీ/నాసిరకం వస్తువులను పంపుతుంటారు. ఈ స్కామర్‌లు తరచుగా త్వరగా లాభాలు పొందిన తర్వాత అదృశ్యమవుతారు, తర్వాత కస్టమర్లు ఇబ్బందిలో పడతారు.

## అవాస్తవిక డిస్కౌంట్లు

ఆన్‌లైన్ షాపింగ్ స్కాంలు మరింత అధునాతనంగా మారాయి. చట్టబద్ధమైన, మోసపూరిత రిటైలర్ల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడం వినియోగదారులకు సవాలుగా మారింది. స్కామర్లు తరచుగా విశ్వసనీయ బ్రాండ్‌లను పోలి ఉండే నమ్మకమైన వెబ్‌సైట్‌లను సృష్టిస్తారు, సున్నితమైన సమాచారాన్ని పంచుకోవడానికి లేదా మోసపూరిత ఆన్‌లైన్ కొనుగోళ్లు చేయడానికి కస్టమర్‌లను ఆకర్షిస్తారు. ఇలా ఆన్‌లైన్‌లో మోసగాళ్లు నకిలీ వెబ్‌సైట్లను సృష్టించడం ద్వారా తక్కువ ధరలకు ఉత్పత్తులను అమ్మడానికి ప్రచారం చేస్తారు. ఇంకా, సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను ఉపయోగించి కొనుగోలుదారులను ఆకర్షించడానికి తమ వంతు ప్రయత్నాలు చేస్తారు. ఈ-కామర్స్ సైట్లలో ఏదైనా ఆఫర్..నమ్మశక్యం కాని ధరలో ఉంటే, అలాంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలి.

## నకిలీ సైట్లు

మోసపూరిత ఆన్‌లైన్ షాపింగ్ సైట్లు..అనేక వ్యాకరణ, స్పెల్లింగ్ లోపాలతో పేలవంగా రూపొందించి ఉండొచ్చు. వీటిపై అనుమానాస్పద సంప్రదింపు వివరాలు, కస్టమర్ సమీక్షలు లేకపోవచ్చు లేదా అధిక సంఖ్యలో ప్రతికూల సమీక్షలు ఉండొచ్చు. ముఖ్యంగా, ఇతర రిటైలర్లతో పోలిస్తే అనేక వస్తువులపై ఆశ్చర్యపోయే అతి తక్కువ ధరలు ఈ సైట్లు ప్రకటిస్తుంటాయి. ఇంకా, 'పరిమిత స్టాక్ లేదా బుకింగ్‌కు సమయం తక్కువ' వంటి ప్రకటనల ద్వారా వినియోగదారులను ఎక్కువ సేపు ఆలోచించకుండా వెంటనే నిర్ణయాలు తీసుకునేలా తొందరపెడతాయి.



## షాపింగ్‌కు చూడాల్సినవి

వినియోగదారులు ఎల్లప్పుడూ ప్రముఖ పేరున్న విశ్వసనీయ వెబ్‌సైట్స్ నుంచి షాపింగ్ చేయాలి. సురక్షితమైన చెల్లింపు పద్ధతులు, స్పష్టమైన రిటర్న్/రీఫండ్ విధానాలు, కస్టమర్లకు వేగంగా ప్రతిస్పందించే వెబ్‌సైట్ నుంచే కొనుగోళ్లు జరపాలి. ఏదైనా వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారాన్ని నమోదు చేసే ముందు, వెబ్‌సైట్ సురక్షితమైన కనెక్షన్‌ను కలిగి ఉందని నిర్ధారించుకోండి. బ్రౌజర్ చిరునామా బార్‌లో ప్యాడ్‌లాక్ చిహ్నం చూడండి. ఇవి, మీ డేటాను రక్షించడానికి సైట్ ఎన్‌క్రిప్షన్‌ను ఉపయోగిస్తుందని సూచిస్తాయి. చట్టబద్ధమైన ఆన్‌లైన్ స్టోర్‌లు..భౌతిక చిరునామా, ఫోన్ నంబర్, ఇమెయిల్ చిరునామాతో సహా స్పష్టమైన సంప్రదింపుల సమాచారాన్ని అందిస్తాయి. విక్రేతకు సంబంధించిన ఖ్యాతిని, వారి ఉత్పత్తులు లేదా సేవల నాణ్యతను అంచనా వేయడానికి కస్టమర్ సమీక్షలు, అభిప్రాయాన్ని చదవండి. ఆన్‌లైన్ చెల్లింపులు చేసేటప్పుడు, క్రెడిట్ కార్డులు లేదా విశ్వసనీయ డిజిటల్ వాలెట్‌లు వంటి సురక్షిత పద్ధతులను ఉపయోగించండి. వస్తువును కొనుగోలు చేసే ముందు విక్రేత, ఉత్పత్తిని పూర్తిగా పరిశోధించండి. వస్తువు వివరాలను చదవండి. స్పెసిఫికేషన్‌లను తనిఖీ చేయండి. ఇతర రిటైలర్‌లతో ధరలను సరిపోల్చండి. పరిమిత లేదా అస్పష్టమైన ఉత్పత్తి సమాచారాన్ని కలిగిన విక్రేతల పట్ల జాగ్రత్తగా ఉండండి. పబ్లిక్ నెట్‌వర్క్‌లకు కనెక్ట్ అయి ఉన్నప్పుడు ఆన్‌లైన్ కొనుగోళు చేయడం మానుకోండి.



## ప్రసిద్ధ ప్లాట్‌ఫామ్స్, చెల్లింపులు

ఆన్‌లైన్(ఈ-కామర్స్) వెబ్‌సైట్ల నుంచి వస్తువులు కొనుగోలు చేసినప్పుడు, తప్పనిసరిగా పేరున్న విశ్వసనీయ సైట్లనే ఆశ్రయించండి. మీకు తెలియని సైట్ల నుంచి వచ్చే ప్రమోషనల్ ప్రకటనలు లేదా పాప్-అప్స్‌పై క్లిక్ చేయకుండా ఉండండి. ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు చెల్లింపులు కార్డు ద్వారా కాకుండా డిజిటల్ వాలెట్ల ద్వారా సురక్షిత చెల్లింపులు చేయండి. ఇక్కడ మీ కార్డు సమాచారాన్ని నేరుగా నమోదు చేయకపోవడం ద్వారా, హ్యాకర్లు మీ డేటాను యాక్సెస్ చేసే ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు.





# చరిత్రాత్మక విజయం

## దక్షిణాఫ్రికాకు ఘోర ఓటమి.. 276 రన్స్‌తో ఆసీస్ భారీ విజయం

## ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్, కామెరూన్ గ్రీన్ సెంచరీలు

మెకే : దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌ను కోల్పోయిన ఆస్ట్రేలియాకు 'భారీ' ఊరట విజయం దక్కింది. నామమాత్రమైన ఆఖరి మ్యాచ్‌లో ఏకంగా 276 పరుగుల తేడాతో సఫారీ జట్టును ఆసీస్ చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 431 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా 155 పరుగులకే కుప్పకూలింది.

### దంచుడే దంచుడు

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాకు అదిరే ఆరంభం దక్కింది. తొలి వికెట్‌కు ట్రావిస్ హెడ్ (142: 103 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్స్‌లు), మిచెల్ మార్ష్ (100, 106 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఏకంగా 250 పరుగులు జోడించారు. హెడ్ ఔటైన తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన కామెరూన్ గ్రీన్ (118: 55 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్స్‌లు) విశ్వరూపం ప్రదర్శించాడు. శతకం చేసిన కాసేపటికే మార్ష్ ఔటైన తర్వాత అలెక్స్ కేరీ (50బి: 37 బంతుల్లో) క్రీజ్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. కేరీ, గ్రీన్ ఎడాపెడా బౌండరీలతో విరుచుకుపడ్డారు. ఈ క్రమంలో ఆసీస్ తరఫున వేగంగా సెంచరీ బాదిన రెండో బ్యాటర్‌గా గ్రీన్ నిలిచాడు. మార్ష్‌తో కలిసి గ్రీన్ మూడో వికెట్‌కు కేవలం 81 బంతుల్లో 164 పరుగులు జోడించాడు. దక్షిణాఫ్రికా బౌలర్లు కేశవ్ మహరాజ్, సెనురన్ ముతుస్వామి చెరో వికెట్ తీశారు.

### డెవాల్డ్ బ్రెవిస్ కాసేపు..

భారీ లక్ష్యం ఎదురుగా ఉన్నప్పుడు దూకుడుగా ఆడాలి. కానీ, దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ అనుకున్నంత వేగంగా ప్రారంభం కాలేదు. క్రమం తప్పకుండా వికెట్లను కోల్పోతూనే ఉంది. ఏ దశలోనూ విజయం సాధించేలా కనిపించలేదు. డెవాల్డ్ బ్రెవిస్ (49) కాసేపు పోరాడినా సరిపోలేదు. టోనీ డి జోర్జి (33), టెంబా బవుమా (19), కార్బిన్ బోష్ (17), రైయన్ రికిల్‌టన్ (11) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. ఆసీస్ బ్యాటర్లు పరుగులు చేసిన పిచ్‌పై దక్షిణాఫ్రికా తేలిపోయింది. కూపర్ కన్నోల్లె (5/22) దెబ్బకు కుదేలైంది. కూపర్‌తోపాటు బార్ట్‌లెట్ 2, సీన్ అబాట్ 2, ఆడమ్ జంపా ఒక వికెట్ పడగొట్టారు.

### లక్ష్య ఛేదనలో 200 దాటలేదు..

ఆస్ట్రేలియా – దక్షిణాఫ్రికా మధ్య మూడు వన్డేల్లోనూ తొలుత బ్యాటింగ్ చేసిన జట్టే గెలవడం గమనార్హం. లక్ష్య ఛేదనకు దిగిన టీమ్ కనీసం 200 మార్క్‌ను కూడా తాకలేదు. ఈ మూడు మ్యాచుల్లో రెండు ఒకేమైదానంలో (ఆస్ట్రేలియాలోని మాకాయ్) జరిగాయి. తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 296 పరుగులు చేయగా.. ఆస్ట్రేలియా 198 రన్స్‌కే ఆలౌటైంది. ఇక రెండో వన్డేల్లో తొలుత సఫారీ జట్టు 277 పరుగులు చేయగా.. ఆసీస్ 193 పరుగులకే పరిమితమై ఓడింది. ఇప్పుడు ఆతిథ్య జట్టు 431 పరుగులు చేస్తే, దక్షిణాఫ్రికా 155 పరుగులకే ఆలౌటైంది.

# క్రికెట్‌కు ఛెతేశ్వర్ పుజారా గుడ్‌బై..

భారత వెటరన్ క్రికెటర్ ఛెతేశ్వర్ పుజారా ఆటకు వీడ్కోలు పలికాడు. అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి రిటైర్‌మెంట్ తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. ఈ మే-రకు సోషల్ మీడియా వేదికగా రిటైర్‌మెంట్‌పై పోస్టు పెట్టాడు. 'నయా వాల్'గా పేరొందిన పుజారా భారత్ తరఫున ఎన్నో విలువైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. "భారత జెర్సీ ధరించడం, జాతీయ గీతం ఆలపించడం, జట్టు కోసం నా వంతు అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నించడం.. ఇవన్నీ కేవలం మాటల్లో చెప్పలేని అనుభవాలు. అయితే ఎప్పుడైనా సరే ఇలాంటి మంచి విషయాలకు ముగింపు పలకాల్సిందే. అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి రిటైర్ కావాలని నిర్ణయించుకున్నా. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. రాజ్ కోట్ పట్టణం నుంచి కుటుంబంతో కలిసి వచ్చిన ఓ కుర్రాడు.. భారత క్రికెట్‌లోకి అడుగు పెట్టాలనే కలను నెరవేర్చుకున్నాడు. ఎన్నో అవకాశాలు వచ్చాయి. ఎంతో అనుభవం సాధించా. నా రాష్ట్రం, దేశం కోసం



ప్రాతినిధ్యం వహించడం గౌరవంగా భావిస్తా. ఈ సందర్భంగా బీసీసీఐ, సౌరాష్ట్ర క్రికెట్ అసోషియేషన్‌కు కృతజ్ఞతలు. క్రికెట్ కెరీర్ ఎదుగుదలకు తోడ్పాటు అందించారు. ఫ్రాంచైజీ, కౌంటీ క్రికెట్ ప్రతినిధులకూ ధన్యవాదాలు. నా మెంటార్‌లు, కోచ్‌లు, ఆధ్యాత్మిక గురు.. ఇలా ప్రతి ఒక్కరూ నా ఎదుగుదలలో కీలక పాత్ర పోషించారు. సహచర క్రికెటర్లు, సపోర్ట్ స్టాఫ్, నెట్ బౌలర్లు, అనలిస్ట్‌లు, లాజిస్టిక్‌లు, అంపైర్లు, గ్రౌండ్ స్టాఫ్, స్కోరర్లు, మీడియా పర్సనల్, స్పాన్సర్లు, పార్ట్‌నర్స్, మేనేజ్‌మెంట్ సహకారం మరువలేనిది. కుటుంబ సభ్యులు, నా భార్య పూజ, నా కుమార్తె అదితి, స్నేహితులు.. ఇలా ప్రతి ఒక్కరూ కీలక పాత్ర పోషించారు. ఇక నుంచి మరింత సమయం నా కుటుంబానికి వెచ్చించేందుకు ప్రయత్నిస్తా" అని పుజారా వెల్లడించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లోకి 2010లో అడుగు పెట్టిన పుజారా 103 టెస్టులు ఆడాడు. మూడు డబుల్ సెంచరీలు, 19 సెంచరీలు, 35 హాఫ్ సెంచరీల సాయంతో 7,195 పరుగులు చేశాడు. కేవలం ఐదు వన్డేలే ఆడిన అతడు 51 పరుగులు చేశాడు. చివరిసారిగా భారత్ తరఫున 2023లో ఆస్ట్రేలియాపై టెస్టు మ్యాచ్ ఆడాడు.

## ఆసియా కప్.. ప్రతి మ్యాచ్‌లోనూ

# బుమ్రాను ఆడించరు : ఏబీ డివిలియర్స్

ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా వర్క్‌లోడ్ కారణంగా కేవలం మూడు మ్యాచులే ఆడాడు. దీంతో అప్పుడు మేనేజ్‌మెంట్ తీరుపై విమర్శలు వచ్చాయి. ఇప్పుడు ఆసియా కప్ కోసం ప్రకటించిన జట్టులో బుమ్రాకు అవకాశం దక్కింది. మరి అతడు అన్ని మ్యాచుల్లోనూ ఆడతాడా? లేకపోతే ఇక్కడా మినహాయింపు ఉంటుందా?అనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఏబీ డివిలియర్స్ ఆసక్తికర కామెంట్లు చేశాడు. బుమ్రాను కీలకమైన మ్యాచుల్లోనే ఆడించే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేశాడు. "బుమ్రాను ఆసియా కప్ స్క్వాడ్‌లో చూడటం బాగుంది. ఫిట్‌గా ఉన్న అతడు తన సత్తా ఏంటో చూపించేందుకు సిద్ధమయ్యాడు. కీలకమైన మ్యాచులకే అతడిని ఎంపిక చేస్తారని ఇంతకుముందు పలు రిపోర్ట్‌లు చూశా. ముఖ్యమైన సీనియర్ ఆటగాళ్లను ఎలా మేనేజ్ చేయాలో సెలక్టర్లకు బాగా తెలుసు. 30 ఏళ్లు దాటిన ప్లేయర్ల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. వారి వర్క్‌లోడ్‌పై ఎప్పుడూ ఓ కన్నేసి ఉంచాలి. జస్‌ప్రీత్ బుమ్రా గతేడాది కూడా




ఇలానే ఇబ్బంది పడ్డాడు. ఆస్ట్రేలియాతో బోర్డర్ – గావస్కర్ ట్రోఫీ చివర్లో అతడు గాయపడ్డాడు. దీంతో గత ఛాంపియన్స్ ట్రోఫీకి దూరంగా ఉండిపోయాడు. అలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా ఉండేందుకే ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో తెలివిగా బుమ్రాను ఆడించారు. ఇప్పుడు ఆసియా కప్ జట్టులోకి తీసుకున్నారు. ఇలాంటి ప్లేయర్లను కీలకమైన మ్యాచుల్లో ఆడిస్తే అత్యుత్తమ ప్రదర్శనను రాబట్టేందుకు ఆస్కారం ఉంది" అని ఏబీ డివిలియర్స్ వ్యాఖ్యానించాడు.

### ఎవరైనా సరే జాగ్రత్తగా మాట్లాడాలి: కైఫ్

ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో బుమ్రా ఆడిన మ్యాచుల్లో భారత్ విజయం సాధించలేదు. దీంతో అతడిపై సోషల్ మీడియాలో అనుచిత కామెంట్లు వచ్చాయి. తన కుమారుడితో కలిసి బుమ్రా దిగిన ఫొటోపైనా కొందరు విమర్శలు గుప్పించారు. దీంతో మాజీ క్రికెటర్ కైఫ్ తీవ్రంగా స్పందించాడు. "మాటలను చాలా జాగ్రత్తగా వాడాలి. బుమ్రా ఎన్ని మ్యాచుల్లో సింగిల్ హ్యాండ్‌తో గెలిపించాడో మీకు తెలుసా? ఒక్కసారి అతడి గణాంకాలు చూసి మాట్లాడండి. బుమ్రా భారత క్రికెట్‌కు దొరికిన వజ్రం. అతడిపై ఒక్క మచ్చ లేదు" అని కైఫ్ వ్యాఖ్యానించాడు.




# ఆన్‌లైన్ గేమింగ్ బ్యాన్ ఎఫెక్ట్..

## భారత జెర్సీపై 'డ్రీమ్11'ను భర్తీ చేసేదెవరు?

నగదుతో ముడిపడిన ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణను అడ్డుకొనేందుకు కేంద్రం తీసుకొచ్చిన చట్టం ఇటు క్రికెట్‌పైనా ప్రభావం చూపిస్తోంది. దీంతో ఇప్పటి వరకూ టీమ్‌ఇండియాకు ప్రధాన స్పాన్సరర్‌గా వ్యవహరించిన 'డ్రీమ్ 11' ఒప్పందం నుంచి మధ్యలో నిష్క్రమించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరికొన్ని రోజుల్లో ఆసియా కప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో తాజా పరిణామంతో బీసీసీఐ క్లిష్ట పరిస్థితుల్లో పడింది. కొత్త స్పాన్సరర్‌ను వెతుక్కునే అవసరం ఏర్పడింది. ఆసియా కప్ జెర్సీలను కొత్త స్పాన్సరర్‌తో ముద్రించాల్సి ఉంటుంది. ఇక టీమ్‌ఇండియాకు స్పాన్సర్‌షిప్ అంటే.. బడా కంపెనీలే క్యూ కడతాయి. జెర్సీ స్పాన్సర్‌షిప్ హక్కుల కోసం త్వరలో కొత్త బిడ్‌లను బీసీసీఐ ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. మరి డ్రీమ్ 11 స్థానాన్ని భర్తీ చేసేవాటిపై ఓ లుక్కేస్తే.. ఆటోమొబైల్ కంపెనీలు, ఎఫ్ఎంసీజీ రంగాలు టీమ్‌ఇండియా స్పాన్సర్‌షిప్ తీసుకునేందుకు ఆసక్తి చూపించవచ్చు. ఇప్పటికే టాటా గ్రూప్ ఐపీఎల్‌కు ప్రధాన స్పాన్సరర్‌గా వ్యవహరిస్తోంది. జెరోధా, ఏంజెల్ వన్, గ్రో వంటి ఫిన్‌టెక్ సంస్థలు తమ కస్టమర్ బేస్‌ను విస్తరించుకునేందుకు స్పాన్సర్‌షిప్ రేసులోకి రావొచ్చు. ఇక దిగ్గజ సంస్థలైన రిలయన్స్, అదానీ గ్రూప్‌లు కూడా ఈ రేసులోకి రావొచ్చు. డ్రీమ్ 11 నిష్క్రమణను వారు మంచి అవకాశంగా మలుచుకోవచ్చు. ఐపీఎల్, డబ్ల్యూపీఎల్‌లో ఈ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లో దీనిని సువర్ణావకాశంగా మలచుకోవచ్చు. సెప్టెంబర్ 9 నుంచి ఆసియాకప్ టోర్నీ ప్రారంభం కానుంది. చాలా తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో.. ఒక వేళ కొత్త స్పాన్సర్ దొరక్కపోతే.. ఎలాంటి స్పాన్సరర్ లేకుండానే టీమ్‌ఇండియా ఆడే అవకాశం కూడా లేకపోలేదు. ఇక స్పాన్సర్‌షిప్‌పై ఇప్పటి వరకూ బీసీసీఐ ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. అయితే.. భారత చట్టాలకు కట్టుబడి ఉంటామని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. టీమ్‌ఇండియా కొత్త స్పాన్సరర్‌గా ఆ అవకాశం ఎవరికి దక్కుతుందో చూడాలి మరి.



# సుందరి పాత్రపై ట్రోల్స్..

## స్పందించిన జాన్వీ కపూర్

జాన్వీ కపూర్ నటించిన లేటెస్ట్ రొమాంటిక్ కామెడీ మూవీ 'పరమ్ సుందరి'. ఈ సినిమా ట్రైలర్ విడుదల అనంతరం జాన్వీపై నెట్టింట ట్రోల్స్ వచ్చాయి. ఉత్తరాదికి చెందిన ఆమెను మలయాళ యువతిగా చూపించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. కేరళ బ్యాక్‌డ్రాప్ చిత్రంలో నటించేందుకు మలయాళ హీరోయిన్స్ లేరా? అంటూ గాయని పవిత్రా మేనన్‌లాంటి వారు ప్రశ్నించారు. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో జాన్వీ వాటిపై స్పందించారు. "అవును నేను మలయాళ అమ్మాయిని కాదు. మా అమ్మ (శ్రీదేవి) కూడా మలయాళీ కాదు. కానీ, కేరళ సంస్కృతి పట్ల నేనెప్పుడూ ఆసక్తి చూపిస్తా. ముఖ్యంగా మలయాళ సినిమాలకు నేను అభిమానిని. 'పరమ్ సుందరి'లో నేను మలయాళ అమ్మాయిగానే కాదు తమిళ అమ్మాయిగానూ కనిపిస్తా. ఇది వినోదాత్మక కథ. ఈ సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉంది" అని జాన్వీ పేర్కొన్నారు. కేరళ యువతి, దిల్లీ యువకుడి ప్రేమకథే ఈ 'పరమ్ సుందరి'. సిద్ధార్థ్ మల్హోత్రా హీరో. సుందరి దామోదరం పిళ్లైగా జాన్వీ, పరమ్ సచ్‌దేవ్‌గా సిద్ధార్థ్ నటించారు. తుషార్ జలోటా దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# సక్సెస్ కోసం వాళ్లతో పడుకుంటే తప్పేముంది

## ఇండస్ట్రీ కల్చర్‌పై దీక్షా పంత్ సంచలన కామెంట్స్

నటి దీక్షా పంత్.. బిగ్ బాస్ రియాలిటీ షో ద్వారా భారీ పాపులారిటీ దక్కించుకుంది. పలు సినిమాల్లో నటిస్తూ తనకంటూ గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్న బ్యూటీ.. ఇంకా కెరీర్ స్లోగానే ఉందని, తను ఇంకా సక్సెస్‌ఫుల్ కాలేదని చెప్పింది. ఇండస్ట్రీలో సెక్స్, సక్సెస్ మధ్య రిలేషన్ గురించి ఓ పాడ్ కాస్ట్‌లో మాట్లాడిన దీక్ష.. సంచలన కామెంట్స్ చేసింది. సెక్స్ కోరుకున్నప్పుడు ఇస్తే సక్సెస్ ఇస్తాననే ఇండస్ట్రీ కల్చర్‌పై మీ అభిప్రాయం ఏంటని ప్రశ్నించగా.. ఇద్దరికి ఓకే అనుకున్నప్పుడు.. సెక్స్, సక్సెస్ హ్యాండ్ ఇన్ హ్యాండ్ తీసుకోవడంలో తప్పేముందని చెప్పింది. ప్రశ్నించేందుకు మనమెవరం అని అడిగింది. కానీ తాను అలా ఎప్పుడూ చేయలేదని.. అందుకే సినీ పరిశ్రమలో సక్సెస్ కాలేదన్న దీక్ష.. ఇండస్ట్రీలో ఎంటరైన కొత్తలో ఇలాంటి కాస్టింగ్ కౌచ్ ఎక్స్‌పీరియన్స్‌లు రెండు ఎదురైనట్లు తెలిపింది. కానీ తను పట్టించుకోలేదని చెప్పింది యంగ్ బ్యూటీ.



# ట్రెడిషనల్ లుక్‌లో అంజలి

హీరో విశాల్ ప్రజెంట్ తన కెరీర్‌లో 35వ ప్రాజెక్ట్‌కు సిద్ధం అయ్యాడు. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత ఆర్బీ చౌదరి ప్రతిష్ఠాత్మక బ్యానర్ సూపర్ గుడ్ ఫిలిమ్స్ నిర్మిస్తోంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఇందులో అంజలి కీలక పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుపుతూ.. ఆమెను ప్రాజెక్టులోకి ఆహ్వానిస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను షేర్ చేశారు. ఈ పోస్టర్‌లో అంజలి ట్రెడిషనల్‌గా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. రవి అరసు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నటి దుషార విజయన్ విశాల్ సరసన హీరోయిన్‌గా నటిస్తుంది. ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ రిచర్డ్ ఎం. నాథన్ కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు. నటుడు విశాల్, దర్శకుడు రవి అరసు కాంబోలో ఇది మొదటి చిత్రం. ఇటీవల ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు చెన్నైలో అట్టహాసంగా జరిగిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. సినిమాకు సంబంధించిన ఇతర వివరాల్ని త్వరలోనే ప్రకటించనున్నారు .

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com